

సోమశిలలో 18.399 టీఎంసీల నిల్వ



అనంతసాగరం, ఫిబ్రవరి 24: సోమశిల పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా శనివారం నాటికి జలాశయంలో 18.399 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 2,500, ఉత్తరకాలువకు 600, దక్షిణ కాలువకు 550 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

ఇద్దరు

సీనియర్లు
కొత్తవాళ్లు

టీడీపీ-జనసేన ఉమ్మడి జాబితాలో నలుగురికి చోటు

- నెల్లూరు సిటీ నుంచి నారాయణ, రూరల్ నుంచి శ్రీధర్‌రెడ్డి
- కావలి, ఉదయగిరిలలో కొత్తవారికి అవకాశం
- కావ్య కృష్ణారెడ్డి, కాకర్ల సురేష్ తొలిసారిగా బరిలోకి..
- మిగిలిన నియోజకవర్గాలపై ఉత్కంఠ

నెల్లూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : అనుకున్నదే జరిగింది. కూర్పు కుదిరింది. తెలుగుదేశం-జనసేన పార్టీల ఉమ్మడి జాబితాలో జిల్లాలోని నాలుగు అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థుల పేర్లు ఖరారయ్యాయి. నెల్లూరు నగరం నుంచి మాజీ మంత్రి పొంగూరు నారాయణ, నెల్లూరు రూరల్ నుంచి సిటింగ్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కావలి నుంచి దగుమాటి వెంకట కృష్ణారెడ్డి (కావ్య), ఉదయగిరి నుంచి కాకర్ల సురేష్ ఉమ్మడి పార్టీల అభ్యర్థులుగా బరిలో దిగనున్నారు. నెల్లూరు పార్లమెంట్‌తోపాటు ఆత్మకూరు, కోవూరు, సర్వేపల్లి, కందుకూరు అసెంబ్లీ నియోజకవర్గాలకు రెండవ జాబితాలో అభ్యర్థులను ప్రకటించనున్నారు. తొలి జాబితాలో చోటు సంపాదించుకున్న నలుగురిలో ఒకరు మాజీ మంత్రి, మరొకరు సిటింగ్ ఎమ్మెల్యే కాగా మిగిలిన ఇద్దరు కొత్తవారు. నెల్లూరు సిటీ అభ్యర్థి పొంగూరు నారాయణ గత తెలుగుదేశం ప్రభుత్వంలో శాసన మండలి సభ్యునిగా, మున్సిపల్ శాఖ మంత్రిగా టీడీపీ ప్రభుత్వంలో కీలక నేతగా పనిచేశారు. ఇక నెల్లూరు రూరల్ అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆ నియోజకవర్గం నుంచి రెండవ సారి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. హ్యాట్రిక్ కోసం ఇప్పుడు బరిలో నిలిచారు. కావలి అభ్యర్థి దగుమాటి వెంకటకృష్ణారెడ్డి, ఉదయగిరి అభ్యర్థి కాకర్ల సురేష్‌కు తొలిసారిగా అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు.

హ్యాట్రిక్ కోసం..



కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి... విద్యార్థి సంఘ నాయకుడిగా రాజకీయాల్లోకి ఆరంగేట్రం చేశారు. ప్రజా సమస్యలపై వరుస పోరాటాలతో నియోజకవర్గ స్థాయి నాయకుడిగా ఎదిగారు. యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పని చేశారు. వైసీపీ ఆవిర్భావంతో వైఎస్.జగన్‌వైపు ఆకర్షితుడై ఆ పార్టీలో చేరారు. ఆ పార్టీ అభ్యర్థిగా నెల్లూరు రూరల్ నుంచి 2014, 2019 ఎన్నికల్లో వరుసగా విజయం సాధించారు. పార్టీకి ఎంత సేవచేసినా అధినేత వద్ద గుర్తింపు లేకపోవడం, తనపై అనుమానంతో ఫోన్ ట్యాంపింగ్‌కు పాల్పడటం, తనపై ఉన్న కక్షను నియోజకవర్గ ప్రజలపై చూపి, ఏమాత్రం అభివృద్ధి పనులు చేయకపోవడంతో విసిగిపోయిన ఆయన వైసీపీ అధినాయకత్వంపై తిరుగు బాటు చేశారు. రాష్ట్రంలో జగన్‌పై తిరుగుబాటు ప్రకటించిన తొలి వైసీపీ ఎమ్మెల్యేగా గుర్తింపు పొందారు. తనపై నమ్మకం లేని పార్టీలో కొనసాగడం ఇష్టంలేక వైసీపీ నుంచి బయటకు వచ్చారు. తెలుగుదేశం ఆహ్వానం మేరకు ఆ పార్టీలో చేరారు. ప్రస్తుతం టీడీపీ-జనసేన పార్టీల ఉమ్మడి అభ్యర్థిగా నెల్లూరు రూరల్ నియోజకవర్గం నుంచి 3వ పర్యాయం పోటీ చేస్తున్నారు.

రెండోసారి బరిలోకి..




ప్రజలకు పరిచయం అక్కర్లేని పేరు పొంగూరు నారాయణ. అధ్యాపక వృత్తి నుంచి జీవితం ప్రారంభించి విద్యాసంస్థ అధినేతగా దేశవ్యాప్తంగా గుర్తింపు పొందారు. తెలుగుదేశం పార్టీతో నారాయణ అనుబంధం కొన్ని దశాబ్దాల కాలం నాటిది. పార్టీ అంతర్గత వ్యవహారాల్లో క్రియాశీలక నాయకుడిగా పనిచేసిన ఆయన 2014లో తొలిసారిగా ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చారు. టీడీపీ నుంచి శాసన మండలికి ఎన్నికై, మున్సిపల్, అర్బన్ హౌసింగ్ శాఖల మంత్రిగా పని చేశారు. అమరావతి రాజధాని భూసేకరణ, నిర్మాణంలో కీలక పాత్ర పోషించారు. మంత్రి హోదాలో నెల్లూరు నగరంలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టారు. 2019లో తొలిసారిగా ప్రత్యక్ష ఎన్నికల్లో నెల్లూరు సిటీ నుంచి బరిలో దిగారు. ప్రస్తుత సార్వత్రిక ఎన్నికలకు టీడీపీ-జనసేనల ఉమ్మడి అభ్యర్థిగా తొలిజాబితాలోనే చోటు సంపాదించుకున్నారు.

పేదల సొంతింటి కల నెరవేరుస్తా



తొలిజాబితాలోనే నా పేరు ప్రకటించినందుకు చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లకు కృతజ్ఞతలు చెబుతున్నారు. టీడీపీ - జనసేన కూటమి అధికారంలోకి రాగానే నెల్లూరులో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తా. నిరుపేదలందరికీ సొంతింటి కల నెరవేరుస్తా. 50వ డివిజన్‌లో చాలా మంది స్లమ్‌లోనే జీవిస్తున్నారు. వీరందరి స్థితిగతులు మారుస్తా. అధికారంలోకి రాగానే రోడ్డు మీద వ్యాపారం చేసుకుంటున్న వారందరికీ షాపులు కట్టిస్తా.

- నారాయణ, నెల్లూరు నగర అభ్యర్థి



రైతు కుటుంబం నుంచి..

సామాన్య రైతు కుటుంబం నుంచి వచ్చిన దగుమాటి వెంకట కృష్ణారెడ్డి అధ్యాపకుడిగా జీవితాన్ని ఆరంభించారు. స్వశక్తితో వ్యాపారవేత్తగా ఎదిగారు. కావ్య కృష్ణారెడ్డి ట్రస్ట్ పేరుతో సేవా కార్యక్రమాల ద్వారా ఉదయగిరి, కావలి నియోజకవర్గ ప్రజలకు చేరువయ్యారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఆర్వో ప్లాంట్ల ఏర్పాటు, విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగుల పంపిణీ, ఉచిత తాగునీటి సరఫరా.. ఇలా పలు సేవా కార్యక్రమాలతో ప్రజల్లో గుర్తింపు తెచ్చుకున్నారు. 2019 ఎన్నికల్లో ఉదయగిరి టికెట్టు ఆశించి చివరి నిమిషంలో విఫలమయ్యారు. ఈసారి ఈయన్ను కావలి సీటు వరించింది. టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థిగా తొలి జాబితాలోనే చోటు దక్కింది.

చంద్రబాబుకు రుణపడిఉంటా



టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా నన్ను ప్రకటించిన నారా చంద్రబాబు నాయుడుకు జీవితాంతం రుణపడి ఉంటా. ఇందుకు సహకరించిన నారా లోకేష్, పవన్‌కళ్యాణ్, అచ్చెన్నాయుడు, జిల్లా పార్టీ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ రాంభూపాల్‌రెడ్డి, నారాయణ, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, బీద రవిచంద్ర, అబ్దుల్ అజీజ్, మనుక్రాంత్‌రెడ్డిలకు ధన్యవాదాలు తెలుపుతున్నా. అందరినీ కలుపుకొని పోయి ఎన్నికల్లో మరోసారి విజయం సాధించి, నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయిస్తా.

- కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే

కావలికి కాపుకాస్తా : కావ్య



కావలి టీడీపీ అభ్యర్థిగా ఎంపిక చేసినందుకు పార్టీ అధినేత చంద్రబాబు, యువనేత లోకేష్‌తోపాటు అందరికీ ధన్యవాదాలు చెబుతున్నా. అందరినీ కలుపుకుని శ్రమిస్తా. కావలికి కాపు కాసేందుకు ఎప్పుడూ మీ వెన్నంటే ఉంటా. శాంతిభద్రతలను కాపాడుతూ ప్రశాంత వాతావరణం నెలకొల్పేందుకు కృషి చేస్తా. పేద బడుగు బలహీనవర్గాల అభ్యున్నతికి కృషి చేస్తా. చివరి ఆయకట్టుకు నీరందించే విధంగా ప్రణాళికను రూపొందిస్తా. పారిశ్రామిక అభివృద్ధితో యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తా.

- కావ్య కృష్ణారెడ్డి, కావలి

ఉదయగిరి కోటపై టీడీపీ జెండా ఎగరేస్తా




ఎన్నికల్లో ఉదయగిరి కోటపై తెలుగుదేశం జెండా ఎగరవేస్తా. తొలి జాబితాలోనే నా పేరు ప్రకటించినందుకు చంద్రబాబు, నారా లోకేష్, అచ్చెన్నాయుడులకు కృతజ్ఞతలు చెబుతున్నా. మాజీ ఎమ్మెల్యే బొల్లినేని రామారావుతోపాటు టీడీపీ, జనసేన నాయకులను సమన్వయం చేసుకుని పని చేస్తా. సీనియర్ నాయకుల సూచనలు, సలహాలు పాటిస్తూ అత్యధిక మెజార్టీతో విజయం సాధిస్తా. ప్రధానంగా నియోజకవర్గంలో సాగు, తాగునీటి కష్టాలు తీర్చడంతోపాటు వలసల నివారణకు పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు కృషి చేస్తా.

- కాకర్ల సురేష్, ఉదయగిరి

సేవా కార్యక్రమాలతో 'గిరి'లో అడుగు

ఉదయగిరి నియోజకవర్గం వరికుంటపాడు మండలం యర్రంరెడ్డిపల్లి స్వస్థలం. తండ్రి కాకర్ల వెంకట సుబ్బనాయుడు విలేజ్ డెవలప్మెంట్ ఆఫీసర్‌గా పని చేశారు. తండ్రి ఉద్యోగ రీత్యా నెల్లూరు జిల్లా పరిధిలోని పలు ప్రాంతాల్లో సురేష్ విద్యాభ్యాసం సాగింది. బీటెక్ పట్టభద్రుడైన సురేష్ స్వశక్తితో అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా ఉద్యోగం సంపాదించారు. నార్త్ కరోలినా రాష్ట్రంలో తెలుగు సంఘం (టాటా) అధ్యక్షుడిగా పని చేశారు. అమెరికాలో తెలుగువారి కోసం ఏర్పాటు చేసిన టానాలో టీం స్క్వేర్ విభాగానికి చైర్మన్‌గా పనిచేసి వందలాది తెలుగుకుటుంబాలకు సేవలందించారు. మాతృభూమి రుణం తీర్చుకునే క్రమంలో వింజమూరులో కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. తెలుగుదేశం పార్టీ వైపు ఆకర్షితుడై మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావు ద్వారా పార్టీ పెద్దలకు పరిచయం అయ్యారు. సేవా కార్యక్రమాల ద్వారా అతి తక్కువ కాలంలోనే ప్రజల్లో, తెలుగుదేశం పార్టీ పెద్దల్లో గుర్తింపు తెచ్చుకుని ఉదయగిరి టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థిగా టిక్కెట్టు సాధించుకున్నారు.





గరుడుడిపై రంగడి వైభోగం

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 24 : మాఘ పౌర్ణమి సందర్భంగా నెల్లూరులో తల్పగిరి రంగనాథుడు స్వర్ణ గరుడుడిపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత స్వామివారికి తిరుమంజనం జరిగింది. సాయంత్రం స్వామివారికి బంగారు గరుడసేవ, పేట ఉత్సవం వేడుకగా జరిగింది. ఈ కార్యక్రమాలను ఉభయకర్తలు, ఆలయ ధర్మకర్తల చైర్మన్ శ్రీనివాసులు, ఈవో వెంకటేశ్వర్లు, అర్చకులు, సిబ్బంది పర్యవేక్షించారు.



బస్సును నెట్టుతున్న ప్రయాణికులు

బండికాదు.. జగమొండి!

ఆర్టీసీ ప్రయాణమంటేనే ప్రజలు హడలిపోయే పరిస్థితులు దాపురిస్తున్నారు. ఉదయగిరి పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో నెల్లూరు వెళుతున్న ఆర్టీసీ అద్దె బస్సు స్టార్ట్ కాకపోవడంతో డ్రైవర్, కండక్టర్లు పడ్డ తిప్పలు అన్నీ ఇన్నీ కావు. చివరకు 'బాబు కాస్త చేయి వేసి, నెట్టండి.' అంటూ స్థానికులు, ప్రయాణికులను ప్రాధేయపడాల్సిన దుస్థితి నెలకొంది. బస్సుల నిర్వహణ సక్రమంగా లేకపోవడం, అధికారుల పర్యవేక్షణ కరువవడంతో ఈ పరిస్థితులు నెలకొన్నాయని ప్రయాణికులు వాపోయారు.

- ఉదయగిరి రూరల్

పెంచలకోనకు పోటెత్తిన భక్తులు

- వైభవంగా మాఘపౌర్ణమి పుష్పయాగం



పెంచలకో నృసింహ స్వామికి పుష్పయాగం

రాపూరు (డక్కిలి), ఫిబ్రవరి 24: మాఘపౌర్ణమి సందర్భంగా ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోన నృసింహస్వామి ఆలయానికి శనివారం భక్తులు భారీగా తరలివచ్చారు. ముందుగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు, వేదపండితులు అనంతరం స్వామిఅమ్మవార్లకు పుష్పయాగాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. అంతకుముందు ఉదయం అభిషేకం, స్నపన తిరుమంజనం చేపట్టారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయ కమిషనర్ సాగర్‌బాబు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ఉభయకర్తలుగా మద్దిశెట్టి చిరంజీవి, దేవసేనలు వ్యవహరించారు.

మాలకొండలో హైకోర్టు న్యాయమూర్తి


వలేటివారిపాలెం, ఫిబ్రవరి 24 : మండలంలోని మాలకొండ లక్ష్మీనరసింహస్వామిని శనివారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తర్లాడ రాజశేఖర్ రావు కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. న్యాయమూర్తి దంపతులకు ఆలయ అధికారులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. గర్భగుడిలో ప్రధాన ఉపఅర్చకులు గౌరీశంకర్ అష్టోత్తర ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం న్యాయ మూర్తి దంపతులను శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు. స్వామివారి ప్రసాదం స్వీకరించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ రావు మాట్లాడుతూ మాలకొండపై ప్రకృతి సౌందర్యం ఎంతో బాగుందన్నారు.నరసింహస్వామి మహిమ కలిగిన దేవుడని తెలుసుకొని, దర్శనానికి వచ్చినట్లు తెలిపారు. ఆయన వెంట ఆలయ డిప్యూటీ కమిషనర్ కేబీ శ్రీని వాసరావు, కందుకూరు ఉప న్యాయాధికారి విజయ బాబు, ఎస్ఐ బాలమహేంద్రనాయక్, తదితరులు ఉన్నారు.



నరసింహస్వామి దర్శనానికి వెళ్తున్న హైకోర్టు న్యాయమూర్తి దంపతులు

2న టీడీపీ అధినేత చంద్రబాబు రాక

- నెల్లూరులో బహిరంగ సభ ఏర్పాటుకు సన్నాహాలు
- బాబు సమక్షంలో పార్టీలో చేరనున్న వీపీఆర్ దంపతులు



నెల్లూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు వచ్చే నెల 2వ తేదీన నెల్లూరుకు రానున్నారు. ఆ రోజున జరిగే బహిరంగ సభలో రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, ఆయన సతీమణి ప్రశాంతిరెడ్డిలు టీడీపీలో చేరనున్నారు. వైసీపీ అగ్రనేతల తీరుకు నిరసనగా వేమిరెడ్డి పార్టీ సభ్యత్వానికి, జిల్లా అధ్యక్ష పదవికి, రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో టీడీపీ జిల్లా నాయకులు వీపీఆర్‌ను కలిసి తమ పార్టీలోకి ఆహ్వానించడం, అందుకు ఆయన సాను కూలంగా స్పందించిన విషయాలు తెలిసిందే. పార్టీలో చేరిక కార్యక్రమం నెల్లూరు నగరం లోనే ఏర్పాటు చేసుకున్నారు. పార్టీలో చేరిక సందర్భంగా నెల్లూరుకు రావాలని చంద్ర బాబును వీపీఆర్ కోరినట్లు, అందుకు ఆయన సమ్మతించినట్లు పార్టీ వర్గాల సమాచారం. పార్టీలో చేరిక, చంద్రబాబు రాక సందర్భంగా నెల్లూరులో వీపీఆర్ ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభ నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ సభా వేదికపై నుంచి వీపీఆర్ దంపతుల తోపాటు ఉమ్మడి నెల్లూరు జిల్లావ్యాప్తంగా ఉన్న ఆయన అనుచరులు, అభిమానులు టీడీపీ తీర్థం పుచ్చుకోనున్నారు.

నోటిఫికేషన్లన్నీ ఒకేసారి

ఉద్యోగార్థుల్లో అయోమయం

నేడు ఏపీపీఎస్సీ గ్రూపు-2 పరీక్ష



నెల్లూరు (హరనాథపురం), ఫిబ్రవరి 24 : వివిధ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు విడుదల కావడంతో నిరుద్యోగులకు ఆనందం కలిగించినా ఒకేసారి విడుదల కావడంతో వారిలో అయోమయం నెలకొంది. అయితే ఎన్ని నోటిఫికేషన్‌లు విడుదలైనా ఉద్యోగాలు మాత్రం తక్కువ సంఖ్యలో ఉండటంతో వారు సంబరపడాలో, ఉద్యోగాలు పెద్దగా లేవని బాధపడలో తెలియని పరిస్థితి ఏర్పడింది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గ్రామ, వార్డు సచివాలయాల్లో ఉద్యోగాలు కల్పించింది. ఆ తరువాత ఇంత వరకు ఎటువంటి నోటిఫికేషన్లు ఇవ్వలేదు. దీంతో నిరుద్యోగులు అనేకమార్లు నిరసనలు తెలిపారు. ఎమ్మెల్యేలు, మంత్రులు, అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. చివరికి ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రభుత్వం గ్రూపు-1, 2లతో పాటు డిప్యూటీ డీఈవో, జూనియర్ లెక్చరర్ల భర్తీకి, డీఎస్సీ, టెట్‌కు సైతం నోటిఫికేషన్ జారీ చేసింది. అయితే జిల్లాలో ఉపాధ్యాయ పోస్టులు చాలా తక్కువగా చూపింది. ఉపాధ్యాయ ఉద్యోగాలపై ఆశలు పెట్టుకున్న నిరుద్యోగులకు ఉద్యోగాల సంఖ్య తక్కువగా ఉండటంతో కొంత నిరుత్సాహంలో ఉన్నారు. గతంలో డీఎస్సీకి దరఖాస్తు చేసుకొంటే సొంత జిల్లాతో పాటు నాన్‌లోకల్‌గా కూడా ఇతర జిల్లాలకు వెళ్లి పరీక్ష రాసుకొనే వీలుండేది. ఈసారి అలాంటి ఆప్షన్ లేదంటున్నారు. ఉద్యోగ పరీక్షలకు వయోపరిమితి పక్క రాష్ట్రం తెలంగాణలో 47 ఏళ్లు ఉంది. మన రాష్ట్రంలో 44 ఏళ్లకే పరిమితం చేశారు. ఉద్యోగాల కోసం పోటీ పరీక్షలు రాయాలనుకున్నా వయస్సు దగ్గరగా ఉన్న అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. ఈ క్రమంలో తెలంగాణలో మాదిరిగానే ఉద్యోగ నియామక పరీక్ష వయస్సు పెంచాలని కోరుతున్నారు.

● నేడు ఏపీపీఎస్సీ గ్రూపు-2 పరీక్ష

జిల్లాలో ఆదివారం ఏపీపీఎస్సీ గ్రూపు-2 పరీక్ష జరగనుంది. 23,908 మంది అభ్యర్థులు హాజరయ్యే ఈ పరీక్షకు జిల్లావ్యాప్తంగా 80 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరిగే ఈ పరీక్షకు అధికార యంత్రాంగం పకడ్బందీ ఏర్పాట్లు చేసింది. అభ్యర్థుల సందేహాల నివృత్తికి కలెక్టరేట్‌లో 0861-2331261 నెంబరుతో కాల్‌సెంటర్ ఏర్పాటు చేశారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు హాల్ టికెట్‌తో పాటు ఏదైనా గుర్తింపు కార్డు తప్పనిసరిగా తీసుకుని వెళ్లాలి. సెల్‌ఫోన్లు ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించరు.

● పటిష్ట బందోబస్తు

నెల్లూరు(క్రైం) : గ్రూప్-2 స్క్రీనింగ్ పరీక్షకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని ఎస్పీ డాక్టర్ కే.తిరుమలేశ్వరరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.15 గంటలు దాటిన తర్వాత ఒక్క నిమిషం ఆలస్యమైన అభ్యర్థులను పరీక్షకు అనుమతించరని పేర్కొన్నారు. ప్రతి కేంద్రం వద్ద ఒక ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారి పర్యవేక్షణలో పోలీసు సిబ్బంది బందోబస్తు ఉంటారని తెలిపారు. అదనంగా రక్షక్ మొబైల్, బ్లూ కోల్ట్స్ సిబ్బందితో పటిష్ఠ భద్రత ఏర్పాటు చేశామని తెలిపారు. ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టామని పేర్కొన్నారు.

● అభ్యర్థులకు ఆర్టీసీ సహకారం: ఆర్‌ఎం

గ్రూప్-2 పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు ఆర్టీసీ సంస్థ పూర్తి సహకారం అందిస్తుందని ఆర్టీసీ ఆర్‌ఎం పీవీ శేషయ్య తెలిపారు. బస్సుల పరంగా ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని జిల్లావ్యాప్తంగా పరీక్ష జరిగే కేంద్రాలకు బస్సులు నడిచేలా, ఆ రూట్లలో ఎలాంటి సర్వీసులను రద్దు చేయకుండా ముందస్తు చర్యలు చేపట్టామన్నారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు బస్సులు ఎక్కడ ఆపినా నిలిపాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశామన్నారు.

వేటగాళ్ల ఉచ్చుకు వన్యప్రాణుల బలి

పొదలకూరు, ఫిబ్రవరి 24: మండలంలోని ప్రభగిరిపట్నం, ఉలవరపల్లి, ఎర్రపాలెం, బత్తులపల్లి, నేదురుపల్లి, భోగసముద్రం గ్రామాల్లో కొందరు అక్రమంగా వన్యప్రాణుల వేట సాగిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. వేటలో భాగంగా సీసాలకు ఇనుప తీగలు చుట్టి సమీపంలో ఉన్న విద్యుత్ తీగలకు తగిలించడంతో అటుగా వచ్చే వన్యప్రాణులు వాటికి తగిలి విద్యుదాఘాతానికి గురై మృతి చెందుతున్నాయి. మృతి చెందిన వన్యప్రాణుల మాంసాన్ని విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఎక్కువగా అడవి పందులు, జింకలు, దుప్పుల వేట సాగుతోందని, దీనిపై అధికారులు స్పందించి గ్రామాల్లో వన్యప్రాణుల వేట సాగిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.



వేట కోసం సీసాకు చుట్టిన ఇనుప తీగ

వృద్ధురాలి దారుణ హత్య

● 14 సవర్ల బంగారు నగలు, నగదు దోపిడీ ● క్లూస్‌టీం.. డాగ్‌స్క్వాడ్ రంగప్రవేశం

● భయాందోళనలో రెడ్డిపాళెం గ్రామస్థులు

బుచ్చిరెడ్డిపాళెం, ఫిబ్రవరి 24: వృద్ధురాలు దారుణ హత్యకు గురైన సంఘటన మండలంలోని రెడ్డిపాళెంలో శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. వివరాలిలా ఉన్నాయి. రెడ్డిపాళెంలోని పోలేరమ్మ గుడి వీధికి ముందు వీధిలో ఓ ఇంట్లో గెడేసిన ఈశ్వరమ్మ (74) నివాసముంటోంది. నిత్యం శివాలయంలో భజనకు, పాలు కోసం మరో ఇంటికి వెళ్లే ఈశ్వరమ్మ గురు, శుక్రవారాలలో వెళ్లకపోవడంతో స్థానికులకు అనుమానం వచ్చి ఇంటికెళ్ళి చూస్తే బయట గేటుకు తాళం వేసివుంది. దీంతో నెల్లూరు బాలాజినగర్‌లో ఉంటున్న ఆమె పెద్ద కుమారుడు జి వెంకటేశ్వర్లురెడ్డికి ఫోన్ చేయడంతో అక్కడికి రాలేదనీ, ఇంట్లో చూడమని చెప్పాడు. దీంతో వారు వెళ్ళి చూసేసరికి ఇంట్లో నుంచి దుర్వాసన రావడంతో మళ్ళీ వెంకటేశ్వర్లురెడ్డికి ఫోన్‌చేశారు. దీంతో అతను అర్ధరాత్రి 12గంటలకు రెడ్డిపాళెం చేరుకుని స్థానికుల సహకారంతో ఇంటి గ్రిల్స్ తొలగించి ఇంట్లోకి వెళ్ళి చూడగా ఈశ్వరమ్మ మంచంమీద మృతిచెంది వుంది. దీంతో గుండెపోటుతో మృతి చెందిందని భావించారు. కాగా, కొంతసేపటి తరువాత బెడ్‌రూం వద్దకెళ్ళి చూసేసరికి తాళం వేసి వుంది. ప్రధాన ద్వారానికీ తాళం వేసి వున్నా తాళాలు కనిపించలేదు. దీంతో రెండు తాళాలు పగలగొట్టి చూసేసరికి బెడ్‌రూంలో బీరువా తలుపులు పగలగొట్టి బీరువాలో బట్టలు చెల్లా చెదురుగా పడేసి వున్నాయి. అనుమానం వచ్చి వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సీఐ, హైమారావు, ఎస్‌ఐ మహేంద్ర వెంటనే సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి వివరాలు సేకరించారు. బీరువాలోని 8 బంగారు గాజులు, నక్లెస్, రెండు ఉంగరాలు, రూ. 60వేల నగదు దోపిడీకి గురైనట్టు మృతురాలి కుటుంబ సభ్యులు గుర్తించారు. కాగా, మృతురాలికి ఏడాదికి సుమారు లక్ష రూపాయల వరకు పొలాల లీజు నగదు, నెలనెలా పింఛను వస్తుంటుంది. కాగా, ఈ సంఘటనతో రెడ్డిపాళెంలో విషాదంతో పాటు స్థానికుల్లో భయాందోళన నెలకొంది. బెంగళూరులో బిల్డర్‌గా వున్న మృతురాలి రెండో కుమారుడు శ్రీనివాసులురెడ్డి శనివారం రెడ్డిపాళెంకు చేరుకున్నాడు.



హత్య జరిగిన ఇంట్లో పరిశీలిస్తున్న పోలీసులు

వేలిముద్రల సేకరణ

కాగా, శనివారం ఉదయం 7గంటలకు రూరల్ డీఎస్పీ వీరాంజనేయరెడ్డి, ఎఎస్పీ సౌజన్య, క్లూస్‌టీం, డాగ్‌స్క్వాడ్‌తో సంఘటనా స్థలానికి చేరుకుని ఇంట్లో వేలిముద్రలు సేకరించారు. డాగ్ స్క్వాడ్ మృతురాలి ఇంటి నుంచి పోలేరమ్మ అరుగు వద్దకెళ్ళి అక్కడి నుంచి చెన్నూరు రోడ్డు వద్ద కొండాయగుంటకు వెళ్ళే మార్గంవరకు వచ్చి అక్కడి నుంచి మళ్ళీ వచ్చిన దారినే వెనక్కి వెళ్ళి మృతురాలి ఇంటికి చేరుకుంది. ఈమేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. సేకరించిన ఆధారాల మేరకు నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ హైమారావు తెలిపారు.

3న మేదరమెట్లలో 'సిద్ధం' సభ

● రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి

నెల్లూరు (హరనాథపురం) : ప్రకాశం జిల్లా మేదరమెట్లలో 3వ తేదీన సిద్ధం మహాసభ జరుగుతుందని రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి చెప్పారు. నగరంలోని వైసీపీ జిల్లా కార్యాలయంలో శనివారం తిరుపతి, నెల్లూరు, ప్రకాశం జిల్లాలకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ముఖ్య నేతలతో ఆయన సమావేశమయ్యారు. మేదరమిట్ల లో జరిగే సిద్ధం సభకు 15 లక్షల మంది జనం హాజరయ్యేలా చూడాలని సూచించారు.



మంత్రులు, ఎమ్మెల్యేలతో చర్చిస్తున్న విజయసాయిరెడ్డి

ద్విచక్ర వాహనం అదుపు తప్పి యువకుడి మృతి

మర్రిపాడు, ఫిబ్రవరి 24: మండలకేంద్రం సమీపంలోని నందవరం- గుండెమడకల ప్రధాన రహదారిపై శుక్రవారం రాత్రి యువకుడు ద్విచక్ర వాహనంలో వెళ్తూ అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న ముళ్ల పొదల్లో పడి మృతి చెందాడు. ఉదయం రోడ్డుపై వెళ్లే ప్రయాణికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్‌ఐ విశ్వనాథ్‌రెడ్డి తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించి మృతుడు వింజమూరు మండలానికి చెందిన మాల్యాద్రి (33)గా గుర్తించారు. అతను కొంతకాలంగా కుటుంబానికి దూరంగా ఉంటూ మర్రిపాడు మండలం పొంగూరులో కూలిపని చేసుకుంటూ జీవిస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చెప్పారు.



మృతుడు మాల్యాద్రి

తాళం వేసిన ఇంట్లో చోరీ

● నగదు, బంగారం అపహరణ

అనంతసాగరం, ఫిబ్రవరి 24: పాతదేవరాయపల్లికి చెందిన కత్తి నరసింహా ఇంట్లో శుక్రవారం రాత్రి దుండగులు చొరబడి ఆభరణలు, నగదు దోచుకెళ్లారు. బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శుక్రవారం ఉదయం కుటుంబ సభ్యులు ఇంటికి తాళం వేసి దైవ దర్శనం కోసం ఏఎస్‌పేటకు వెళ్లారు. తిరిగి శనివారం ఉదయం ఇంటికి వచ్చి చూడగా తాళం పగులగొట్టి బీరువాలోని 2.5 సవర్ల బంగారు నగలు, రూ.12వేల నగదు, 50కువైట్ దినార్‌లు దోచుకెళ్లినట్లు గుర్తించారు. ఈ విషయంపై అనంతసాగరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ సూర్యప్రకాష్‌రెడ్డి సంఘటన ప్రాంతానికి వచ్చి పరిశీలించారు. క్లూస్ టీమ్‌ను పిలిపించి ఆధారాలు సేకరించారు. త్వరలో నిందులను పట్టుకొంటామని తెలిపారు.



చోరీ జరిగిన ఇంట్లో పరిశీలన చేస్తున్న ఎస్‌ఐ

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	156
లేయర్ లైవ్	80
స్కిన్ చికెన్	270
స్కిన్‌లెస్	300
లేయర్	136

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 5943
వెండి కిలో ధర	రూ. 72,100
వెండి ఒక గ్రాము	రూ. 74.10

రెండు దుకాణాలలో..

చేజర్ల, ఫిబ్రవరి24: ఇంటి పైకప్పులు పగలకొట్టి ఒకేరోజు రెండు దుకాణాలలో చోరీ చేసిన సంఘటన శనివారం తెల్లవారుజామున నూతక్కివారికండ్రిక గ్రామంలో చోటు చేసుకుంది. అదురుపల్లి పొదలకూరు ప్రధాన రహదారి నూతక్కివారికండ్రిక వద్ద ఉండే శ్రీ సాయి ట్రేడర్స్, దాని సమీపంలో ఉన్న కూల్‌డ్రింక్ దుకాణంలో రూ.25వేలకు నగదుతో పాటు కొన్ని వస్తువులు తీసుకెళ్లినట్లు దుకాణ యజమానులు రవి, శ్రీనివాసుల రెడ్డి గుర్తించారు. శుక్రవారం రాత్రి 11 గంటల వరకు దుకాణాలను మూసివేసి ఇంటికి వెళ్లామని, శనివారం ఉదయాన్నే దుకాణాన్ని తెరిచే లోపల పైకప్పు తొలగించి అందులో వస్తువులు చిల్లా చెదరగా పడి ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. ఈ విషయంపై పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశామన్నారు.

తీర్మానం చేయరు.. నగదు ఇవ్వరు!

● జగన్న ఇళ్ల లబ్ధిదారుల గగ్గోలు ● సర్పంచు తీరుతో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులకు బ్రేక్

● అర్ధంతరంగా ఆగిన నిర్మాణాలు ● సర్పంచు తీరుపై డీపీవోకు ఫిర్యాదు

విడవలూరు, ఫిబ్రవరి 24 : జగన్న కాలనీ లబ్ధిదారుల వింత సమస్య ఇది. సాక్షాత్తు సర్పంచే పంచాయతీ తీర్మానం చేయకపోవడంతో వారికి అందవలసిన నిధులకు బ్రేక్ పడింది. ఎమ్పీడీవో నోటీసులకే స్పందించకపోవడంతో ఈ పంచాయితీ డీపీవో వరకు వెళ్లింది. విడవలూరు మండలం ముదివర్తిలో అందరికీ ఇళ్ల పథకం కింద సుమారు 115 ఇళ్లు మంజూరయ్యాయి. ఇందులో 27 మంది లబ్ధిదారులు ఇళ్లను నిర్మించుకుంటున్నారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద ఒక్కో లబ్ధిదారుడికి 90 రోజుల పని దినాలను కల్పిస్తూ (రోజుకు రూ.274 చొప్పున 24,420) కేంద్ర ప్రభుత్వం దశలవారీగా మంజూరు చేస్తుంది. ఇందుకుగాను గ్రామ సర్పంచు పంచాయతీ తీర్మానం చేయాల్సి ఉంటుంది. అయితే, మండలంలోని 14 పంచాయతీల్లో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు లబ్ధిదారులకు అందుతుండగా, ఒక్క ముదివర్తిలోనే బ్రేక్ పడింది. కేవలం తీర్మానం చేయకపోవడం వల్లే తమకు చేరవలసిన రూ.6.59 లక్షలకు బ్రేక్ పడిందని లబ్ధిదారులు వాపోతున్నారు.



ముదవర్తిలో అర్ధంతరంగా నిలిచిపోయిన ఓ ఇంటి నిర్మాణం

● సర్పంచు తీరుపై ఆగ్రహం

అధికార పార్టీకి చెందిన సర్పంచు తీరుపై లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇంటికి వస్తే సంతకాలు పెడతానని 5 నెలలుగా తిప్పుకుంటూ నానా ఇబ్బందులకు గురి చేస్తోందని వాపోతున్నారు. దీనిపై స్థానిక మండలాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, 2022- 23 ఆర్థిక సంవత్సరం పూర్తయితే తమకు విడుదలైన నిధులు బురదలో పోసిన పన్నీరవుతుందని లబ్ధిదారులు ఆవేదన చెందుతున్నారు. మరోవైపు పంచాయతీ తీర్మానం ఇవ్వకపోవ డంపై సర్పంచు నిర్మలమ్మకు ఎమ్పీడీవో శ్రీనివాసులు ఇటీవల నోటీసులు జారీ చేశారు. అయి నా ఆమె స్పందించక పోవటంతో జిల్లా పంచాయతీ అధికారికి (డీపీవో)కి ఫిర్యాదు చేశారు.

ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాం

జగనన్న ఇళ్లకు సంబంధించి ముదివర్తి సర్పంచు తీర్మానం ఇవ్వలేదు. అప్పటికే నోటీసులు జారీ చేసినా ఆమె స్పందించలేదు. ఇక చేసేదిలేక ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాము. వారి ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటాము.

- శ్రీనివాసులు, ఎంపీడీవో

ఇండియా కూటమిదే అధికారం : చింతా

నెల్లూరు(సాంస్కృతికం), ఫిబ్రవరి 24 : కేంద్రంలో కాంగ్రెస్ పార్టీతో కలిసిన ఇండియా కూటమి అధికారంలోకి వస్తుందని మాజీ కేంద్ర మంత్రి డాక్టర్ చింతా మోహన్ తెలిపారు. శనివారం నెల్లూరు ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వంలో జీఎస్‌టీ పన్నుల భారం, అభివృద్ధి మొత్తం అదానీ, అంబానీ వంటి వారికే లభించిందన్నారు. జరగనున్న ఎన్నికల్లో బీజేపీకి 150 సీట్లు లోపు వస్తాయని జోస్యం చెప్పారు. రాష్ట్రంలో జగన్, చంద్రబాబులను ప్రజలు ఓడిస్తున్నారని తెలిపారు. 1978లో వచ్చిన కాంగ్రెస్ గాలి ప్రస్తుతం వీస్తోందని, 175 అసెంబ్లీ సీట్లలో 130 సీట్లు గెలుచుకొని ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందన్నారు. తెలంగాణలో రైతులకు రూ.2 లక్షలు రుణం మాఫీ చేసినట్లు, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే పేదలకు రూ.2లక్షలు రుణాలను రద్దు చేస్తామని చెప్పారు. వీర బ్రహ్మేంద్రస్వామి కాలజ్ఞానం ప్రకారం తిరుపతే రాజధాని అవుతుందన్నారు. 70 ఏళ్ల క్రితం ఉమ్మడి మద్రాసు రాష్ట్రం విడిపోయినప్పుడు ఎన్‌జీ రంగా నెహ్రూకు తిరుపతిని రాజధాని చేయమని చెప్పారని, రాజకీయ బలం ఉన్న నీలం సంజీవరెడ్డి కర్నూలుకు తీసుకుపోయారన్నారు. అక్కడి నుంచి హైదరాబాద్‌కు వెళ్లిందన్నారు. 2014లో రాష్ట్ర విభజన సమయంలో తొందరపాటు బాబు శాపగ్రస్తమైన తుళ్లూరులో ఏర్పాటు చేశారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి 3 రాజధానులని రాష్ట్రానికి రాజధాని లేకుండా పాలించాడన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పీ.చంద్రశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చింతా మోహన్

ఇసుక అక్రమ తరలింపుపై టీడీపీ నిరసన

ఆత్మకూరు, ఫిబ్రవరి 24: అప్పారావుపాలెం సమీపంలో పెన్నానది నుంచి ఇసుక అక్రమ తరలింపును శనివారం ఆత్మకూరు టీడీపీ నాయకులు అడ్డుకుని నిరసన తెలిపారు. గత కొంతకాలం నుంచి అధికార పార్టీ దొంగ బిల్లులతో అక్రమంగా ఇసుక తరలిస్తుండడంతో పార్టీ ఆదేశాల మేరకు నాయకులు ఇసుక లారీలను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఆత్మకూరు రూరల్ టీడీపీ అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి, మాజీ ఉపాధ్యక్షుడు పిడికిటి వెంకటేశ్వర్లు నాయుడు మాట్లాడారు. దొంగ బిల్లులతో ఇసుకను చలామణి చేస్తూ అక్రమంగా ఇసుకను పక్క జిల్లాలతోపాటు ఇతర రాష్ట్రాలకు తరలించి కోట్ల రూపాయలను దోచుకుంటుందని రాష్ట్ర ప్రభుత్వంపై మండి పడ్డారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు తోడేటి వెంకటయ్య, పయ్యావుల మారుతి నాయుడు, శేషారెడ్డి, అప్పారావుపాళెం గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



అప్పారావుపాలెం రీచ్‌లో యంత్రాలను అడ్డుకుంటున్న టీడీపీ నాయకులు

సామాజిక తనిఖీలపై అంతా గప్‌చుప్

● ఉపాధిలో అవకతవకలు ● మీడియాకి సమాచారం ఇవ్వని అధికారులు

విడవలూరు, ఫిబ్రవరి 24: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం 2022-23 ఆర్థిక సంవత్సరానికి మండలంలో జరిగిన ఉపాధి పనులపై మూడురోజులుగా జరుగుతున్న సామాజిక తనిఖీలు సక్రమంగా జరగటంలేదన్న ఆరోపణలు వ్యక్తమౌతున్నాయి. సాధారణంగా సామాజిక తనిఖీలు జరిగే క్రమంలో ముందస్తుగా ప్రజా ప్రతినిధులకు, పాత్రికేయులకు సమాచారాన్ని అధికారులు ఇవ్వాల్సివుంటుంది. అయితే అధికారులు ఇందుకు భిన్నంగా వ్యహరించారు. పాత్రికేయులకు, ప్రజా ప్రతినిధులకు సమాచారం ఇవ్వకుండా తనిఖీల విషయాన్ని గోప్యంగా ఉంచారు.

ఉపాధిలో అవకతవకలు : మండలంలో 14 పంచాయతీల్లో 929 పనులకుగాను రూ.5.88కోట్ల నిధులను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ నిధుల వినియోగంలో అనేక అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. నీటి పారుదల శాఖ వారు తవ్విన కాలువలను మరలా ఉపాధి హామీ పథకం కింద తవ్వినట్లు మస్టర్లు, బిల్లులు పెట్టుకున్నారు. రోడ్డు పక్కన చెట్ల పెంపకం కింద నాటిన చెట్లు ఎండిపోయిన వాటి సంరక్షణ పేరుతో బిల్లులను స్వాహా చేసినట్లు విమర్శలు ఉన్నాయి. అదేవిధంగా వైసీపీ నాయకులకు సొంత పనులకు కూలీలను పంపి వారికి మస్టర్లు వేశారని స్థానికులు తెలుపుతున్నారు. ఇవి ఎక్కడ వెలుగులోకి వస్తాయోనని సామాజిక తనిఖీ విషయాన్ని అధికారులు గోప్యంగా ఉంచారని, జిల్లా అధికారులు స్పందించి సామాజిక తనిఖీ పారదర్శకంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

రజకుల సంక్షేమంపై చర్చకు వైసీపీ సిద్ధమా?


● రజక సంఘాల మహిళల సవాల్

నెల్లూరు(సాంస్కృతికం), ఫిబ్రవరి 24 : జగన్‌మోహన్‌రెడ్డి 5 ఏళ్ల పాలనలో రజకుల సంక్షేమానికి తీసుకున్న చర్యలపై చర్చకు వైసీపీ నాయకులు సిద్ధమా? అని రజక సంఘా ల రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు దుర్గం పాటి పద్మజ సవాల్ విసిరారు. శని వారం ఆమె ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడుతూ రజకుల సంక్షేమానికి ఏమీ చేశారని ప్రశ్నించారు. 56 బీసీ కార్పొరేషన్‌లకు నిధులిచ్చారా? చైర్మన్, డైరెక్టర్‌లకు కుర్చీలు వేశారా? రజక వృత్తిదారులకు జీవనోపాధి కల్పించారా? అని ప్రభుత్వాన్ని నిలదీశారు. జగన్ ఇచ్చే రూ.10వేలు ఎన్నో ఆంక్షలతో అందని ద్రాక్షలా మారిందన్నారు. పాదయాత్రలో జగన్ ఇచ్చిన హామీ మేరకు ఎన్ని మోడరన్ ధోబీఘాట్‌లు కట్టారు.. ఎంతమంది రజకులకు నామినేటెడ్, ఎమ్మెల్సీ పదవులు ఇచ్చారు, రాజకీయ కోటా ఎక్కడ అమలు చేశారని ప్రశ్నించారు. జగన్ అరాచక పాలనలో రజక యువతులు, మహిళలపై అత్యాచారాలు, హత్యలు జరిగాయన్నారు. వాటిని చేసిన వైసీపీ నాయకులపై చర్యలు తీసుకోకుండా సాక్ష్యాలను తారుమారు చేశారన్నారు. శ్రీకాళహస్తిలో మునిరాజమ్మ అనే రజక మహిళ టీడీపీ నాయకులతో తిరిగిందని ఆమె జీవనోపాధిని ధ్వంసం చేసి, అట్రాసిటీ కేసులు పెట్టి వేధించారని తెలిపారు. రజకులకు ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేసిన దేవుడు చంద్ర బాబు అన్నారు. ఆయన హయాంలో 90 శాతం పూర్తయిన ధోబీఘాట్‌లను కూడా జగన్ పూర్తి చేయలేదన్నారు. రాబో యే సార్వత్రిక ఎన్నికల్లో సైకో జగన్ ప్రభుత్వానికి చరమ గీతం పాడుతామంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సమావేశంలో రజక సంఘం రాష్ట్ర నాయకురాళ్లు ఎం.లత, ఎం.మునిరాజమ్మ, పీ.కృష్ణమ్మ, పీ.మస్తానమ్మ పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న రజక సంఘాల నాయకులు

ఇసుక టిప్పర్ బోల్తా



బోల్తా పడిన టిప్పర్

వరికుంటపాడు, ఫిబ్రవరి 24: వేగంగా వెళ్తున్న ఓ ఇసుక టిప్పర్ బోల్తా పడిన సంఘటన శనివారం స్థానిక కోల్డ్ స్టోరేజి సమీపంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. నెల్లూరు నుంచి ప్రకాశం జిల్లా పామూరుకు జాతీయ రహ దారిపై వెళ్తున్న క్రమంలో డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవడంతో ఒక్కసారిగా అదుపు తప్పిన టిప్పర్ పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తా పడింది. ఈప్రమాదంలో డ్రైవర్‌కు గాయాలవడంతో అతన్ని చికిత్స నిమిత్తం సమీప వైద్యశాలకు తరలించారు.

డిగ్రీ పరీక్షల్లో ఐదుగురి డిబార్

వెంకటాచలం, ఫిబ్రవరి 24 : విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ డిగ్రీ కళాశాలలో శనివారం జరిగిన డిగ్రీ ఒకటవ సెమిస్టర్ పరీక్షలలో ఐదుగురు విద్యార్థులు డిబార్ అయినట్లు వర్సిటీ పరీక్షల నిర్వాహణాధికారి ఆర్ మధుమతి ఒక ప్రటకనలో తెలిపారు. పరీక్షలకు 323 మంది గైర్హాజరైనట్లు పేర్కొన్నారు. నెల్లూరులోని జగన్స్ డిగ్రీ కళాశాలలో ఒకరు, కృష్ణచైతన్య డిగ్రీ కళాశాలలో ఒకరు, శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో ఒకరు, జెనేస్ విజన్ డిగ్రీ కళాశాలలో ఒకరు, పొదలకూరులోని విజ్ఞాన డిగ్రీ కళాశాలలో ఒకరు మొత్తం ఐదుగురు విద్యార్థులు డిబార్ అయినట్లు తెలిపారు.

జనహితం కోసం తపించిన జన్నత్ హుస్సేన్

● మాజీ ఎంపీ మేకపాటి

ఆత్మకూరు, ఫిబ్రవరి 24: సీనియర్ ఐఏఎస్ అధికారిగా తాను పని చేసిన ప్రతి చోట దివంగత జన్నత్ హుస్సేన్ జనహితం కోసం తపించారని నెల్లూరు మాజీ ఎంపీ, వైసీపీ సీనియర్ నేత మేకపాటి రాజమోహన్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని అనేక దళితవాడలు, పేదల కాలనీలు ఆయన పేరుతో వెలిశాయంటే ఆయన పట్ల ప్రజలకు ఉన్న ప్రేమ తెలియజేస్తుందన్నారు. చివరి దశలో అల్జీమర్ వ్యాధితో ఆయన బాధపడుతున్నప్పుడు తాను స్వయంగా వెళ్లి వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పానని పేర్కొన్నారు. జన్నత్ హుస్సేన్ ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యం ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.

లాభాల బాటలో డీసీఎంఎస్

● పాలకవర్గ సమావేశంలో చైర్మన్ చలపతిరావు

నెల్లూరు(హరనాథపురం), ఫిబ్రవరి 24: రైతులకు ఇతోధికంగా సేవలందిస్తూ డీసీఎంఎస్‌ను లాభాల బాటలో నడుపుతున్నామని జిల్లా కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ చైర్మన్ వీరి చలపతిరావు చెప్పారు. శనివారం నగరంలోని డీసీఎంఎస్ రైస్ మిల్లులో జరిగిన పాలకవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో నష్టాల్లో కూరుకు పోయి కనీసం జీతాలు ఇవ్వలేని స్థితిలో ఉన్న డీసీఎంఎస్‌ను వివిధ వ్యాపారాల ద్వారా లక్షలాది రూపాయలు సమకూర్చి లాభాలబాట పట్టించామన్నారు. గత పాలకవర్గ తప్పిదాల వలన రూ.12 లక్షల జీఎస్‌టీ చెల్లించాల్సి వచ్చిందన్నారు. జిల్లాలో కోవిడ్, వరదల సందర్భంలో రూ.67.5 లక్షలు విరాళాలు అందజేశామన్నారు. ఇటు రైతులు, అటు ప్రజాసేవలో డీసీఎంఎస్ ముందుకుపోతుందన్నారు. నెల్లూరు నగరంలోని డీసీఎంఎస్ రైసు మిల్లు స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ కల్యాణ మండపం నిర్మించాలనుకొంటున్నాని, దీని ద్వారా ఇతోధికంగా లాభాలు వస్తాయన్నారు. జిల్లా వ్యాప్తంగా ఎరువుల విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు. ప్రతి ఏటా క్రమం తప్పకుండా వేదగిరి లక్ష్మీనరసింహస్వామి వ్యాసపూర్ణిమ నగరోత్సవాన్ని నిర్వహిస్తున్నామన్నారు. రైతులకు ఉపయోగపడే ఏ వ్యాపారాన్నైనా డీసీఎంఎస్ ద్వారా చేస్తామన్నారు. స్టోన్‌హౌస్‌పేటలోని తమ కార్యాలయంలో జన ఔషధి కేంద్రాన్ని త్వరలో ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సమావేశంలో బిజినెస్ మేనేజర్ వెంకటస్వామి, డైరెక్టర్‌లు దాసరి భాస్కర్‌గౌడ్, కాసాని రంగనాథం, గునుపాటి సురేష్‌రెడ్డి, గండవరం సురేష్‌రెడ్డి, ఖిల్జీ సలీమ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీసీఎంఎస్ చైర్మన్ వీరి చలపతిరావు

పెట్రోలు పోసుకుని వివాహిత బలవన్మరణం

కావలి రూరల్, ఫిబ్రవరి24: ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని అల్లూరు మంజుల (22) అనే వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది.ఈ సంఘటన శనివారం కావలి పెద్దపవని రోడ్డులో జరిగింది. పోలీసుల కథనం మేరకు, కావలి వైకుంఠపురానికి చెందిన అల్లూరు మాల్యాద్రికి బుచ్చికి చెందిన మంజులతో ఐదేళ్ల కిందట వివాహం జరిగింది. వారికి ముగ్గురు పిల్లలు. ఇంటిలో అత్త నాగమణితో మంజుల రెండు రోజుల కిందట గొడవ పెట్టుకుంది. దీంతో ఇంటి నుంచి అత్త వెళ్లి పోయింది. శనివారం కోడలు కూడా ఇంటి నుంచి వెళుతుండగా భర్త ఆమెను ఇంటివద్దనే ఉండమని చెప్పాడు. అనంతరం తన తల్లిని వెతుకులాడుకోవటానికి మాల్యాద్రి వెళ్లాడు. ఈ క్రమంలో ముగ్గురు పిల్లలను ఇంటిలో ఉంచి బయట గడియ పెట్టి మంజుల ఇంటి నుంచి వెళ్లింది. సమీపంలోని పెద్దపవని రోడ్డులో పెట్రోల్ బాటిల్‌తో తిరుగుతూ స్థానికుల కంటపడింది. కొంతసేపటి తరువాత అక్కడే ఫారెస్టు బంగ్లా వెనుక వైపునకు వెళ్లి పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుంది. దీంతో ఆమె కేకలు వేయడంతో స్థానికులు మంటలు ఆర్పి 108 వాహనంలో కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ మేరకు రెండవ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాఫిక్ సమస్యను పరిష్కారించాలని రాస్తారోకో

ఆత్మకూరు, ఫిబ్రవరి 24: పట్టణంలోని సోమశిల రోడ్డు సెంటర్ నుంచి ఆర్టీసీ డిపో సెంటర్ వరకు నిత్యం ప్రజలు ఎదుర్కొంటున్న ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని సీపీఎం నాయకులు పార్టీ పట్టణ కార్యదర్శి డేవిడ్ రాజు, మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ నందానిలు శనివారం రాస్తారోకో చేప ట్టారు. ఈ సందర్భంగా ఫ్లెక్సీలు చేతపట్టి పార్టీ కార్యకర్తలతో కలిసి సోమశిల రోడ్డు సెంటర్ నుంచి ఆర్టీసీ డిపో సెంటర్ వరకు ర్యాలీగా వెళ్లి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సోమశిల రోడ్డు సెంటర్ నుంచి ఆర్టీసీ డిపో సెంటర్ వరకు రోడ్డు విస్తరణ పనులు ఆగిపోవడంతో ఈ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉందన్నారు. సమస్యను పరిష్కరించాలని ఇటీవల ఆర్డీవోకు వినతిపత్రం అందజేసినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని వాపోయారు. సమస్యను పరిష్కరించే వరకు సీపీఎం ఆధ్వర్యంలో వివిధ రకాలుగా నిరసన చేపడతామన్నారు. రాస్తారోకోతో కొంత సమయం వాహన రాకపోకలు నిలిచిపోయాయి. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కౌలు రైతు నేత లక్ష్మీపతి, వాగల శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.



రాస్తారోకో నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

పల్స్‌పోలియోను విజయవంతం చేయండి


ఉదయగిరి : మాట్లాడుతున్న ఎంపీడీవో ఈశ్వరమ్మ


సంగం : సిబ్బందికి సూచనలిస్తున్న వైద్యాధికారులు

ఉదయగిరి రూరల్: మండలంలో వైద్యఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వచ్చే నెల 3, 4, 5వ తేదీల్లో జరిగే పల్స్‌పోలియో కార్యక్రమాన్ని ఆరోగ్య, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయ సిబ్బంది సమన్వయంతో పని చేసి విజయవంతం చేయాలని ఎంపీడీవో ఈశ్వరమ్మ, వైద్యా దికారిణి శివకల్పన ఆదేశించారు. ఈ విషయంపై శనివారం వారు ఉపాధ్యాయ సిబ్బంతో సమావేశమై మాట్లాడారు. ఉదయం 7 నుంచి సాయంత్రం 5గంటల వరకు పోలియో కేంద్రాల్లో అందుబాటులో ఉండాలన్నారు. సిబ్బంది బాధ్యతగా పనిచేసి లక్ష్యాలను అధిగ మిం చాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు మస్తాన్‌వలి, తోట శ్రీనివాసులు, హెచ్ఈ వెంక టసు బ్బయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పల్స్ పోలియోపై అవగాహన

సంగం: స్థానిక ప్రభుత్వ వైద్యశాల ప్రాంగణంలో శనివారం వైద్యాధికారులు శ్రీనివాసులరెడ్డి, అశకోకేలు క్షేత్రస్థాయి వైద్య సిబ్బందికి పల్స్ పోలియో కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్చి 3న పల్స్ పోలియో కార్యక్రమంలో మండలంలో అర్హత కలిగిన చిన్నారులందరికీ పోలియో చుక్కలు వేయించేందుకు బూత్ స్థాయిలో సిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు. పల్స్ పోలియో చుక్కలు వేసే విధానంపై ఆశ, ఏఎన్ఎం, అంగన్‌వాడీ సిబ్బందికి వివరించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమి పూజ

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 24: గండిపాళెంలో నూతనంగా నిర్మించనున్న గురవప్పస్వామి ఆలయ నిర్మాణానికి శనివారం నిర్వాహకులు భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితులు లోకా మురళీధరశాస్త్రి, వెంకటప్రసాద్‌శాస్త్రిలు బుడంగుంట్ల వంశస్తులతో కలిసి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. గణపతి, పుణ్యహవచనం, కలశ, నవగ్రహ, వాస్తుదోషం పూజలు చేశారు.

టీడీపీ శ్రేణుల సంబరాలు

సీతారామపురం, ఫిబ్రవరి 24: కాకర్ల సురేష్‌కి తెలుగుదేశం అధిష్ఠానం ఉదయగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా టికెట్ ఇవ్వడంతో సీతారామపురం కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో శనివారం ట్రస్ట్ మండల కోఆర్డినేటర్ సుమన్ ఆధ్వర్యంలో స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు తిరుపతయ్య, బుజ్జి, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక సత్యనారాయణ వ్రతం


సత్యనారాయణ వ్రతం నిర్వహిస్తున్న అర్చకులు

సంగం, ఫిబ్రవరి 24: మాఘ పౌర్ణమి సందర్భంగా శనివారం స్థానిక సంగమేశ్వరాలయంలో భక్తులు సత్యనారాయణ వ్రతంను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపంలో స్వామి ఉత్సవ విగ్రహాన్ని ఉంచి గజపూలమాలలతో అలంకరించారు. అనంతరం వేదపండితుల ఆధ్వర్యంలో వ్రతం నిర్వహించారు. ఈ వ్రతానికి పలువురు దంపతులతోపాటు మహిళలు అధికసంఖ్యలో పాల్గొన్నారు. పూజల్లో పాల్గొన్న భక్తులకు కమతం కృష్ణారెడ్డి మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేశారు. ఉదయం ఆలయంలోని శ్రీకామాక్షి దేవి మూలవిరాట్‌కు అభిషేకాలు చేశారు. కార్యక్రమానికి కోటు కరుణాకర్‌రెడ్డి ఉభయకర్తలుగా వ్యవహరించారు.

గురుకులంలో ప్రవేశానికి గడువు పొడిగింపు

లింగసముద్రం, ఫిబ్రవరి 24: మండలంలోని పెద పవనిలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవడానికి గడువు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ కే స్నేహలత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 28లోగా విద్యార్థినులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. తెలిపారు.ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

డీఆర్కేకు ఘన నివాళి


దీపాల రాధాకృష్ణమూర్తి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పూర్వ విద్యార్థులు

కావలిటౌన్, ఫిబ్రవరి 24: ప్రముఖ విద్యావేత్త, జేబీ కళాశాల మాజీ కరస్పాండెంట్ దీపాల రాధాకృష్ణమూర్తికి శనివారం పూర్వ విద్యార్థులు ఘననివాళులర్పించారు. రెడ్‌క్రాస్ భవనంలో జరిగిన డీఆర్కే సంతాపసభకు పూర్వ విద్యార్థి డాక్టర్ బెడవాడ రవికుమార్ అధ్యక్షత వహించారు. ముందుగా డీఆర్కే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జేబీ మాజీ అధ్యాపకులు డాక్టర్ మల్లికార్జునరెడ్డి, డాక్టర్ మధుసూదన్‌రావు, లైబ్రేరియన్ వెంకట్రావు, జయప్రతాప్ రెడ్డి, రెడ్‌క్రాస్ ఛైర్మన్ రవిప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్ల వద్ద తెలుగు యువత ఆందోళన

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): పూర్తయిన టిడ్కో గృహాలను లబ్ధిదారులకు జగన్ ప్రభుత్వం ఇవ్వకపోవడాన్ని నిరసిస్తూ తెలుగు యువత ఆధ్వర్యంలో శనివారం నగరంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించి భగత్‌సింగ్ కాలనీలోని టిడ్కో గృహాల వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా టీడీపీ నేత వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ మాజీ మంత్రి నారాయణ భారీ వ్యయంతో నిరుపేదల కోసం టిడ్కో గృహాలను నిర్మించారని, వాటిని లబ్ధిదారులకు ఇవ్వకుండా వైసీపీ ప్రభుత్వం మోసం చేసిందన్నారు.

వందశాతం రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేయండి

సీతారామపురం, ఫిబ్రవరి 24: సీతారామపురం బిట్-1 సచివాలయాన్ని శనివారం ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్ తనిఖీ చేశారు. అనంతరం ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించి మాట్లాడారు. మండలంలోని ప్రతి సచివాలయ పరిధిలో మిగిలి ఉన్న లబ్ధిదారులకు త్వరగా రిజిస్ట్రేషన్ చేయించాలని, వలంటీర్లతో అలాంటి వారికి సమాచారం తెలియపరచి వందశాతం రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి, వీఆర్ఓ మనోహర్, ఇంజనీర్ అసిస్టెంట్ సుమతి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్

రిజిస్ట్రేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయండి

ఉదయగిరి రూరల్: మండలంలో ఏర్పాటు చేసిన జగనన్న లేఅవుట్లలో నిర్మించకున్న లబ్ధిదారుల పక్కాగృహాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఎంపీడీవో ఈశ్వరమ్మ కార్యదర్శులను ఆదేశించారు. శనివారం స్థానిక కార్యాలయంలో కార్యదర్శులతో సమీక్షా సమావేశమై మాట్లాడారు. మండలంలో 989 జగనన్న గృహాల రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 843 రిజిస్ట్రేషన్‌లు పూర్తి చేశామన్నారు. మిగిలిన వాటిని కూడా త్వరగా చేసి నూరు శాతం పూర్తి చేయాలన్నారు. మార్చి చివరికి పూర్తిగా పన్నులు వసూలు చేయాలన్నారు.

ఓటు వినియోగంపై అవగాహన ర్యాలీ

ఆత్మకూరు, ఫిబ్రవరి 24: పట్టణంలో శనివారం మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా అధికారులు, సిబ్బందితో కలిసి ఓటుపై అవగాహనకు చైతన్య రాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఫ్లెక్సీ చేతపట్టి మున్సిపల్ కార్యాలయం నుంచి ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఓటు హక్కును ప్రతిఒక్కరూ వినియోగించుకోవవాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఎన్నికల నోడల్ అధికారులు సతీష్, చంద్రప్రకాష్, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది, మెప్మా, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


చైతన్య ర్యాలీ నిర్వహిస్తున్న కమిషనర్ షేక్ ఫజులుల్లా తదితరులు

కక్ష సాధింపులు తెలియవు : సుకుమార్‌రెడ్డి

బిట్రగుంట, ఫిబ్రవరి 24: కక్షసాధింపులు, వేధింపులు కుట్రలు చేయడం తనకు తెలియదు కాబట్టే ప్రసన్నుడి కటాక్షంతో వైసీపీ అధిష్ఠానం మళ్లీ తనను పార్టీలో చేర్చుకున్నదని కావలి ఏఎంసీ మాజీ ఛైర్మన్ మల్లెవల సుకుమార్‌రెడ్డి అన్నారు. బోగోలు మండలం కొండబిట్రగుంట ప్రసన్న వేంకటేశ్వరస్వామిని శనివారం ఆయన అభిమానులతో కలసి దర్శించుకున్నారు. అనంతరం మాట్లాడుతూ జీవించి ఉన్నతవరకు వైసీపీలోనే కొనసాగుతానని, సీఎం తనకు అప్పగించి బాధ్యతను నెరవేర్చుతానని అన్నారు. త్వరలో జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి, విజయసాయిరెడ్డి, చేవిరెడ్డి భాస్కర్‌రెడ్డిలతో భేటీ కానున్నట్లు తెలిపారు. ఆయన వెంట కావలి,అల్లూరు, బోగోలు మండలాలకు చెందిన అభిమానులు వైసీపీ కార్యకర్తలు తదితరులు ఉన్నారు.


మాట్లాడుతున్న సుకుమార్‌రెడ్డి

మన్నెమాల అనుచరుల బైక్ ర్యాలీ


ర్యాలీలో పాల్గొన్న మన్నెమాల అనుచరులు

అల్లూరు : వైసీపీ నాయకుడు మన్నెమాల సుకుమార్‌రెడ్డి సస్పెన్షన్ ఎత్తేయడంతో ఆయన అనుచరులు సంబరాలు జరుపుకున్నారు. శనివారం ఆయన అనుచరులు అల్లూరు పోలేరమ్మ ఆలయం నుంచి కొండబిట్రగుంట వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. సుకుమార్‌రెడ్డి బిలకూటక్షేత్రంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో అల్లూరు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కార్యక్రమంలో సామంతుల సురేష్‌రెడ్డి, మేడా కృష్ణారెడ్డి, కోడూరు సాదక్‌రెడ్డి, గుమ్మడి సురేంద్ర, నార్తుఆములూరు సర్పంచి షేక్ కరీముల్లాషా ఖాదర్, మేడా మాధవ తదితరులు పాల్గొన్నారు.

పొగాకు చోరీని అరికట్టండి

● రైతుల ఫిర్యాదు

కలిగిరి, ఫిబ్రవరి 24: సాగులోని పొగాకు తోటల్లో రాత్రిళ్లు పొగాకు చోరీ జరుగుతుందని మండలంలోని వెలగపాడు కొత్తూరు, కావలిముస్తాపురం, పెద్దపాడు, కృష్ణారెడ్డిపాలెం తదితర గ్రామాల రైతులు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ స్థానిక పొగాకు వేలం కేంద్రం పరిధిలో అనుమతి పొంది పొగాకు పంటను సాగు చేస్తున్న తమ పొలాల్లో రాత్రివేళల్లో ఆటోలలో వచ్చి దొంగతనంగా పొగాకు తీసుకెళ్తున్నారని పేర్కొన్నారు. బోర్డు అనుమతి ఉంటే తప్ప పొగాకు అమ్మకాలు, కొనుగోలు చేయరాదన్నారు. తమ పంటలకు రక్షణ కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పొగాకు రైతు సంఘ అధ్యక్షుడు రావూరు శ్రీకాంత్‌బాబు, రైతులు నలదల సుధాకర్, పల్లపోలు రామిరెడ్డి, ప్రసాద్, గన్నమనేని కొండపనాయుడు, నంబూరి ప్రవీణ్, వంటేరు నరసింహ తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. లక్ష్మీనృసింహుడి కల్యాణం

కావలి రూరల్, ఫిబ్రవరి24: కావలి చెరువు సమీపంలోని కూచి చిన మాలకొండ క్షేత్రంలో శనివారం మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ వ్యవస్థాపకుడు మాధవరపు మాధవదాసు కుమారుడు మాల్యాద్రిస్వామి ఆధ్వర్యంలో ఆలయాన్ని విద్యుత్ దీపాలు, పచ్చ తోరణాలతో అలంకరించారు. దేవతా మూర్తులను పూలతో ప్రత్యేకంగా అలంకరించి మహానివేదన, మంత్రపుష్ప పూజలు నిర్వహించారు. మాఘ శుద్ధ పౌర్ణమి సందర్భంగా స్వామి, అమ్మవార్లకు కల్యాణం జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మధ్యాహ్నం అన్నసంతర్పణ జరిగింది.

● **ఆలయాల్లో మాఘపౌర్ణమి వేడుకలు**

కందుకూరు : మాఘపౌర్ణమి సందర్భంగా శనివారం పట్టణంలోని వివిధ ఆలయాలకు వేలాదిగా భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. పెద్దబజారులోని కోదండరామాలయంలో సామూహిక సత్రనారాయణ స్వామి వ్రతం నిర్వహించగా పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు మురారిశెట్టి వెంకటసుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలోనూ ప్రత్యేక పూజలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి లక్ష తులసిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షడు గొల్ల వెంకన్న, భక్తులు పాల్గొన్నారు. పట్టణంలోని సాయిబాబా, దక్షిణాముఖ ఆంజనేయస్వామి, సోమేశ్వరాలయం, ఆంజనేయస్వామి ఆలయంలోనూ మాఘపౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● **వైభవంగా ప్రసన్నుడికి గరుడ సేవ**

బిట్రగుంట : బోగోలు మండలం కొండబిట్రగుంట ప్రసన్నవేంకటేశ్వరస్వామికి మాసపౌర్ణమి సందర్భంగా శనివారం రాత్రి గరుడ వాహనసేవ జరిగింది. ఉదయం స్వామి, అమ్మవార్లకు అర్చకులు సత్యనారాయణాచార్యులు, లక్ష్మీనరసింహాచార్యులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉలవపాడు మండలానికి చెందిన చింతం సురేంద్రరెడ్డి, సీతాలక్ష్మి దంపతులు అన్నదానం ఉభయకర్తలు వ్యవహరించారు.


కావలి రూరల్ : లక్ష్మీనృసింహుడి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు


కందుకూరు : సత్యనారాయణ వ్రతంలో పాల్గొన్న భక్తులు


గరుడ వాహనంపై ప్రసన్నుడు

రోడ్డు, రవాణా సౌకర్యాలతో గ్రామాల అభివృద్ధి : మహీధర్

లింగసముద్రం, ఫిబ్రవరి 24: రోడ్డు, రవాణా సౌకర్యాలుంటేనే గ్రామాల అభివృద్ధి జరుగుతుందని కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి చెప్పారు.శనివారం మండలంలోని శింగరపాలెం వద్ద పీఎంజీఎస్‌వై కింద రూ.7.77 కోట్లతో నిర్మించనున్న తిమ్మారెడ్డిపాలెం-అయ్యవారిపల్లి రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ రోడ్డు, రవాణా సౌకర్యాలు ఉంటేనే ఆ గ్రామాలు ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందుతాయన్నారు. అలాగే రాళ్లపాడులోని శాగంవారిపాలెం రోడ్డు, చినపవని అన్నెబోయినపల్లి గ్రామాల మధ్య రోడ్ల పనులను త్వరగా చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ పెన్నా కృష్ణయ్య, డీఈ టీ రమణయ్య, పీఆర్ డీఈ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ జీ శ్రీచరణ్, ఎంపీడీవో యూ శేషుబాబు, ఎంపీటీసీ దగ్గు వెంకటేశ్వర్లు, సర్పంచు డీ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.


లింగసముద్రం : రోడ్డు నిర్మాణ పనులకు పూజ చేస్తున్న ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి

● **అదనపు భవనాలతో మెరుగైన వైద్య సేవలు**

కందుకూరు : ఏరియా హాస్పటల్‌లో అందుబాటులోకి వచ్చిన అదనపు భవనాలతో మరింత మెరుగైన వైద్యసేవలు అందించేందుకు అవకాశం కలుగుతుందని ఎమ్మెల్యే మానుగుంట మహీధరరెడ్డి పేర్కొన్నారు. ఏరియా హాస్పటల్‌లో రూ. 7.78 కోట్లతో నిర్మించిన అదనపు భవనాలను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలో పోకూరు, చేవూరులలో అదనంగా పీహెచ్‌సీలు మంజూరుకాగా పోకూరులో కాంట్రాక్టర్లు ముందుకు రానందున పనులు ప్రారంభంకాలేదన్నారు. చేవూరులో త్వరలో పనులు ప్రారంభమవుతాయని వివరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు, డీసీఎం రమేష్‌నాథ్, ఏరియా హాస్పటల్ సూపరింటెండెంట్ శశికళ, డాక్టరు ఇంద్రాణి, డాక్టరు ఆదిలాభాను, డాక్టరు శైలజ తదితరులు పాల్గొన్నారు.

● **సమస్యల పరిష్కారానికి చర్యలు**

కందుకూరు ఏరియా హాస్పటల్‌లో సాంకేతిక సిబ్బంది కొరత, ఇతర సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని డీసీఎం రమేష్‌నాథ్ పేర్కొన్నారు. డీసీఎం దృష్టికి విలేకరులు పలు సమస్యలు తీసుకెళ్లగా వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని తెలిపారు.

కందుకూరు, కావలి టీడీపీలో పలువురి చేరిక

కందుకూరు, ఫిబ్రవరి 24: మండలంలోని పలుకూరు ఆదిఆంధ్రకాలనీకి చెందిన పలువురు మహిళలు, యువకులు శనివారం టీడీపీలో చేరారు. గ్రామపార్టీ నాయకుల ఆధ్వర్యంలో స్థానిక పార్టీ కార్యాలయానికి వచ్చిన మహిళలు, యువకులు నియోజకవర్గ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో పార్టీలో చేరేందుకు సంసిద్ధత వ్యక్తం చేయగా, ఆయన వారందరికీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగా పార్టీలో చేరినవారికి ప్రాధాన్యతకల్పిస్తూ అన్నివేళలా అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు నార్నె రోశయ్య, బొద్దులూరి కొండలరావు, దామా మల్లేశ్వరరావు, బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, రావుల రవి, యడ్లపల్లి వెంకటనరసింహం, వీ వెంకటరావు పాల్గొన్నారు.

● **విజయనగర్ కాలనీలో బాబు ష్యూరిటీ..**

పట్టణంలోని 32వ వార్డు పరిధిలోని విజయనగర్ కాలనీలో శనివారం సాయంత్రం ఇంటూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. సూపర్‌సిక్స్ పథకాలపై అవగాహన కల్పిస్తూ కరపత్రాలు పంపిణీచేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దామా మల్లేశ్వరరావు, ముచ్చు శ్రీను, ముప్పవరపు వేణు, పోకూరి రాంబాబు, అత్తంటి వరప్రసాదు, ఓరుగంటి రామమూర్తి, గొర్రెపోలు కొండలు తదితరులు పాల్గొన్నారు.

● **కావలిలోనూ చేరికలు**

కావలి : పట్టణంలోని వివిధ వార్డులకు చెందిన పలువురు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. శనివారం కావ్యక్రిష్ణారెడ్డి నివాసంలో పార్టీలో చేరగా కావ్య వారికి కండువాలను వేసి సాదరంగా ఆహ్వానించారు. 28వ వార్డుకు చెందిన నాగిశెట్టి జేజినాయుడు, వీఎల్ఎస్ రెడ్డి, బెల్లంకొండ రవి, షేక్ జిలానీ, అళహరి పవన్‌కుమార్, 23వ వార్డు ఇన్‌చార్జి నెల్లూరు వెంకటేశ్వరరెడ్డి, ఆయన బావమరిది వింతా వెంకటేశ్వరరెడ్డి, ఆంధ్ర శ్రీనివాసులు రెడ్డి, 23వ వార్డుకు చెందిన జవంగుల మల్లికార్జున, షేక్ రమీజ్ తదితరులు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు గుత్తికొండ కిషోర్, జ్యోతి బాబూరావు, మలిశెట్టి వెంకటేశ్వర్లు, మొగిలి కల్లయ్య, మన్నవరవిచంద్ర, పోలిశెట్టి, బీద గిరిధర్, ఆవుల రామకృష్ణ, శ్రీహరినాయుడు తదితరులు పాల్గొన్నారు.


కందుకూరు : ఇంటూరి సమక్షంలో టీడీపీలో చేరిన వారు

● **ఇసుక దందా కనిపించటం లేదా ?**

జగన్ ఇసుక దందా జిల్లా కలెక్టర్లకు కనిపించటం లేదా అని కావలి టీడీపీ అభ్యర్థి కావ్యక్రిష్ణారెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కావలి నియోజకవర్గంలో కూడా ఇసుక డంప్‌లను ఏర్పాటు చేసుకుని, అందులో సముద్రపు ఇసుకను కలిపి పక్క జిల్లాలకు తరలిస్తున్నా అధికారులకు కనపడటంలేదా అని ప్రశ్నించారు. ఇసుక, గ్రావెల్‌లో దోచుకున్న డబ్బుతో వైసీపీ నేతలు గెలవాలను కునేందుకు కుట్రలు చేస్తున్నారన్నారు.

శ్రీవారికి ఏకాంతసేవ


శ్రీవారికి నిర్వహించిన ఏకాంతసేవ

కావలిటౌన్, ఫిబ్రవరి24: ముసునూరు మందాటి చెరువు వద్ద ఉన్న శ్రీలక్ష్మీపద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీవారికి శనివారం ఉదయం చక్రస్నానం, రాత్రికి ఏకాంత సేవ నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక అర్చకులు వేదగిరి సూర్యనారాయణాచార్యులు ఆధ్వర్యంలో ఉదయం ఉత్సవ మూర్తులకు విశేష అభిషేకాలు, ప్రత్యేక పూజలు, తోమాల సేవ, అర్చనలు, హోమం, పూజల అనంతరం చక్రస్నానం నిర్వహించారు. సాయంత్రం ఆలయ ద్వాదశ ప్రదక్షిణల అనంతరం 12 రకాల ప్రసాదాల నివేదన ఇచ్చారు. రాత్రి శ్రీవారికి ఏకాంత సేవ నిర్వహించారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన

లింగసముద్రం : మండలంలోని పలు గ్రామాల్లోని పోలింగ్ బూత్‌లను సందర్శించి, వాటిలోని సౌకర్యాలను శనివారం తహసీల్దార్ జి శ్రీచరణ్ పరిశీలించారు. మండలంలోని ఎర్రారెడ్డిపాలెం, తిమ్మారెడ్డిపాలెం, గంగపాలెం, మాలకొండరాయునిపాలెం, విశ్వనాథపురం, వీఆర్ కోట, అన్నెబోయినపల్లి, సత్యనారాయణపురం గ్రామాల్లోని పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. అక్కడున్న విద్యుత్ సౌకర్యం, మంచినీరు, ర్యాంపులు, కాంపౌండ్ వాల్, మరుగు దొడ్లు, బాతు రూమ్‌లను పరిశీలించారు.ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తామన్నారు.

ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ

బిట్రగుంట : బోగోలు మండలం కోవూరుపల్లి గిరిజన కాలనీ, కడనూతల గ్రామాల్లో శనివారం కావలి సీడీపీవో సౌజన్య అధ్యక్షతన ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు కోటేశ్వరి, సుప్రజ, అనూష, నిర్మల తదితరులు పాల్గొన్నారు.



లక్ష్మీ నరసింహుడి సేవలో ఉగ్రనరసింహారెడ్డి


అనుచరులతో దర్శనానికి వచ్చిన ఉగ్రనరసింహారెడ్డి

వలేటివారిపాలెం, ఫిబ్రవరి 24: మండలంలోని మాలకొండ లక్ష్మీనరసింహస్వామిని శనివారం ప్రకాశం జిల్లా కనిగిరి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ముక్కు ఉగ్రనరసింహారెడ్డి తన అనుచరులతో కలిసి దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు స్వాగతం పలికారు. గర్భగుడిలో ప్రధాన ఉపఅర్చకులు గౌరీశంకర్ అష్టోత్తర పూజలు చేశారు. శాలువా, పూలమాలతో సత్కరించారు. స్వామివారి ప్రసాదం అందచేశారు.

● **స్వామివారి ఆదాయం రూ. 7,94,264**

లక్ష్మీనరసింహస్వామికి శనివారం భక్తుల నుంచి రూ. 7,94,264 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ కేబీ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలు.. అష్టోత్తరం టికెట్‌ల ద్వారా రూ. 6,800, కుంకుమార్చన ద్వారా రూ. 26,160, వివాహాల ద్వారా రూ. 12 వేలు, తలనీలాల ద్వారా రూ. 30,450, వాహనపూజల ద్వారా రూ. 3,220, ప్రత్యేక దర్శనం ద్వారా రూ. 2,13,700. స్థలపురాణం పుస్తకాల విక్రయం ద్వారా రూ. 9,80, రూము అద్దెల ద్వారా రూ. 31,880, కవర్ల ద్వారా రూ. 5,100, లడ్డూప్రసాదం ద్వారా రూ. 1,84,410, అన్నదానం ద్వారా రూ. 2,47,561, విరాళాల ద్వారా రూ. 32 వేలు ఆదాయం వచ్చిందని ఆయన తెలిపారు.

టీడీపీ నేతల నివాళి

కావలి రూరల్, ఫిబ్రవరి24: గుండెపోటుతో మృతి చెందిన కావలి మండలం చినరాముడుపాలెంకి చెందిన వాయిల రామ్‌కుమార్(24) మృతదేహాన్ని శనివారం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కావ్య క్రిష్ణారెడ్డి, మాజీ ఇన్‌చార్జి మాలేపాటి సుబ్బానాయుడులు సందర్శించి నివాళులు అర్పించారు. సమాచారం తెలిసిన వెంటనే గ్రామానికి వెళ్లి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. వారి వెంట నాయకులు ఆవుల రామక్రిష్ణ, సోమయ్యగారి రమణ, కార్యకర్తలు ఉన్నారు.

● **ఎమ్మెల్యే అభ్యర్థిగా ఇంటూరిని ప్రకటించాలి**

లింగసముద్రం : కందుకూరు నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా నియోజకవర్గ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావును ప్రకటించాలని నియోజకవర్గ ఐటీడీపీ ప్రధాన కార్యదర్శి ముల్లపాటి మహేష్ చౌదరి శనివారం ఒక ప్రకటనలో కోరారు. జిల్లాలో రాజకీయ సమీకరణలో గెలుపు రేసులో ఆయన ముందుంటారని పేర్కొన్నారు. పార్టీ అధిష్ఠానం నాగేశ్వరరావుకు టికెట్ ప్రకటించాలని, లేని పక్షంలో నిరాహార దీక్షకు సిద్ధమని తెలిపారు.

దివ్యాంగురాలికి ఫ్యాను అందజేత

కావలి రూరల్ : కావలి మండలం చిన్న రాముడుపాలెంకి చెందిన దివ్యాంగురాలు కాటంగారి రాజేశ్వరికి శనివారం దాత సహకారంతో హ్యాపీ సేవా సంస్థ ఆధ్వర్యంలో టేబుల్ ఫ్యాన్ అందచేశారు. కార్యక్రమం లో సంస్థ అధ్యక్షుడు సయ్యద్ ఘనీబాషా, సభ్యులు చేవూరు ప్రభయ్య, కోడూరు సోమయ్య, కాటంగారి లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ప్రసన్న కనుసన్నల్లోనే ఇసుక దందా

● పోలంరెడ్డి దినేష్‌రెడ్డి ఆందోళన



విడవలూరు: ఇసుకరీచ్‌లో ఆందోళన చేస్తున్న పోలంరెడ్డి దినేష్‌రెడ్డి



బుచ్చిరెడ్డిపాళెం: రీచ్‌లో నిరసన చేస్తున్న జనసేన నాయకులు

విడవలూరు, ఫిబ్రవరి 24: కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి కనుసన్నల్లో ఇసుక దందాలు జరుగుతున్నాయని కోవూరు టీడీపీ ఇన్‌చార్జి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి ఆరోపించారు. ముదివర్తి గ్రామ సమీపంలో ఉన్న ఇసుక రీచ్‌ని శనివారం అయన పరిశీలించి ఆందోళనకు దిగారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ ముదివర్తి ఇసుక రీచ్‌నుంచి రోజుకి 2వేల టన్నుల ఇసుక ఇతర రాష్ట్రాలకు తరలి పోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఇసుక రీచ్‌లో నకిలీ వేబిల్లులతో ఇసుకని తరలిస్తూ లక్షలు దండుకుంటున్నారని అయన ఆరోపించారు. ప్రభుత్వం నుంచి అనుమతులు ఒకదగ్గర తీసుకుని మరోచోట తవ్వకాలు జరుపుతున్నారన్నారు. ఇష్టానుసారంగా ఇసుక తవ్వకాలు జరుపుతూ ప్రసన్నకుమార్‌రెడ్డి కోట్లు దండుకుంటున్నాడని అయన తెలిపారు. టీడీపీ అధికారంలోకి రాగానే ఇసుకాసురుల భరతం పడతామని అయన హెచ్చరించారు. ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులు చెముకుల కృష్ణచైతన్య, చెముకుల శ్రీనివాసులు, ఇమాంబాష, జగదీష్‌రెడ్డి, ఫరీష్, ఇంతా మల్లారెడ్డి, దారా విజయబాబు, శీనయ్య తదితరులు పాల్గొన్నారు.

మినగల్లు ఇసుక రీచ్‌లో జనసేన నిరసన

బుచ్చిరెడ్డిపాళెం : జిల్లాలో ఎక్కడా ఒక్క రీచ్‌కు కూడా ఇసుక తవ్వకాలకు అనుమతులు లేవని చెబుతున్నా లెక్కచేయకుండా యథేచ్ఛగా ఇసుక అక్రమ తరలింపుపై జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ పలువురు జనసైనికులతో శనివారం జగనాసుర 10తలల ప్లకార్డులతో వినూత్న నిరసన చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇసుక దోపిడీతో పెత్తందారులు బలపడుతున్నారని విమర్శించారు. ఈనిరసనలో జనసైనికులు సాయి, హేమచంద్ర, ప్రశాంత్, మౌనిష్, కార్తీక్, కేశవ, శ్రీను, వర పాల్గొన్నారు.

వైభవంగా వ్యాస పౌర్ణమి



ఊరేగుతున్న స్వామి,అమ్మవార్లు

బుచ్చిరెడ్డిపాళెం, ఫిబ్రవరి 24: మండలంలోని జొన్నవాడ ఆలయంలో శనివారం వ్యాస పౌర్ణమి పూజలు వైభవంగా జరిగాయి. ముందుగా ఆలయంలో శ్రీ మల్లికార్జునస్వామి వారికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గంగా, కామాక్షితాయి సమేత మల్లికార్జునస్వామి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా పిశ్వేళ్ళ మల్లికార్జున వ్యవహరించారు. ఆలయ చెర్మన్ మావులూరి శ్రీనివాసులురెడ్డి, ఈ.ఓ వి గిరికృష్ణ, సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీనివాసుడి కల్యాణం

పొదలకూరు, ఫిబ్రవరి 24 : భగవాన్ వెంకయ్య స్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం వేద పండితులు కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో శనివారం ఘనంగా జరిగింది. భక్తుల గోవింద నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. కల్యాణ మహోత్సవంలో భక్తులు, దాతలు, తదితరులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

బీసీల సమస్యల పరిష్కారమే ధ్యేయం

పొదలకూరు, ఫిబ్రవరి 24 : బీసీల సమస్యల పరిష్కారం, వారి అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తామని బీసీ సంక్షేమ సంఘం జిల్లా జాయింట్ సెక్రటరీ వెంకటేశ్వర్లు గౌడ్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని మర్రిపల్లి గ్రామంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు గౌడ్, మండల అధ్యక్షుడు వెంపులూరు మోహన్, మండల యువత అధ్యక్షుడు పచ్చూరు దశయ్యలు మాట్లాడుతూ రాష్ట్ర జనాభాలో అత్యధిక శాతం ఉన్న బీసీలు రాజకీయంగా ఎదిగేందుకు తమ సంఘం దోహదపడుతుందన్నారు. అనంతరం బీసీ సంఘం నేతలు వెంకటేశ్వర్లు గౌడ్, మోహన్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో శంకరయ్యగౌడ్, వెంపులూరు కృష్ణయ్య, వెంకటేశ్వర్లు, హరి, తిరుపాల్, రావుల ముత్యంగౌడ్, పర్చూరి పెంచలయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రకటన

నా క్లయింట్ అయిన కోప్పాయిల్ రామన్ ఓమన W/o. G.R. అంబేద్కర్, డోరు నెం.25-2-2023, గౌతమ్‌నగర్, పొదలకూరు రోడ్డు, నెల్లూరు-4 అనువారు ఇచ్చిన వివరముల మేరకు యిందుమూలముగా యావన్మందికి తెలియజేయడమేమనగా :- నా క్లయింట్ నెల్లూరు బిట్-1 యేరియాలోని సర్వే నెం. 1959రులో గల అసెస్‌మెంటు నెం.1031067588రు గల 25వ వార్డు, డోరు నెం.25-2-1563రు, ప్రగతినగర్‌లోని సూర్యప్రకాష్ కాలనీలోని 33 1/3 అంకణముల స్థలమును అర్కాట్ ధనలక్ష్మీ భర్త నాగయ్య అనువారి వద్ద నుండి రిజిష్టర్డు విక్రయపత్రం తేది:07-08-2000 డాక్యుమెంటు నెం. 5499/2000 (SRO, Nellore) ద్వారా కొనుగోలు చేసినారు. సదరు ఒరిజినల్ డాక్యుమెంటు మరియు దీని యొక్క లింకు డాక్యుమెంట్లు అనగా రిజిష్టర్డు విక్రయపత్రములు తేది:27-04-1985 డాక్యుమెంటు నెం.2356/1985 మరియు తేది:14-02-1985 డాక్యుమెంటు నెం.821/ 1985 (SRO, Nellore) ల్యును జెరాక్స్ తీసుకొను నిమిత్తం నా క్లయింటు తే:16-02-2024దిన తన ఇంటి వద్ద నుండి పద్మావతి సెంటర్‌లో వున్న జెరాక్స్ షాపుకు పోవుచుండగా మార్గమధ్యములో పై తెలిపిన ఒరిజినల్ డాక్యుమెంట్లు పోయినవి. సదరు ఒరిజినల్ డాక్యుమెంట్లు నెం.5499/2000, నెం. 2356/1985 & నెం.821/1985ల్లు ఎవ్వరికైనను దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్సుకు తెచ్చి ఇచ్చిన వారికి తగిన పారితోషికం ఇవ్వబడును. సదరు ఒరిజినల్ డాక్యుమెంట్లను ఉపయోగించి ఎవ్వరైనా ఎట్టి లావాదేవీలు జరిపిన అవి చెల్లనేరవు. అవి నా క్లయింట్‌ను బద్ధగించవు.

తుమ్మా చిట్టిబాబు, బి.ఎ., ఎల్.ఎల్.బి., అడ్వకేట్, 3వ వీధి, గౌతమ్‌నగర్, పద్మావతి సెంటర్, పొదలకూరు రోడ్డు, నెల్లూరు. సెల్: 84650 41753

ముస్లిం మైనార్టీలను మోసం చేసిన వైసీపీ



సమావేశంలో మాట్లాడుతున్న మైనారిటీ నాయకులు అమీర్‌బాషా

పొదలకూరు, ఫిబ్రవరి 24: ముస్లిం మైనారిటీలను వైసీపీ ప్రభుత్వం మోసం చేసిందని టీడీపీ రాష్ట్ర మైనారిటీ నేత అమీర్‌బాషా అన్నారు. శనివారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో మైనారిటీ నాయకులు మీడియా సమావేశం నిర్వహించారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా టీడీపీ మైనారిటీ సెల్ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి షేక్ అమీర్‌బాషా, తిరుపతి పార్లమెంటు టీడీపీ మైనారిటీ సెల్ ఉపాధ్యక్షుడు షేక్ జమీర్‌బాషా, పొదలకూరు మండల టీడీపీ మైనారిటీ సెల్ అధ్యక్షుడు షేక్ ఖాదర్‌బాషా మీడియాతో మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే దుల్హన్ పథకం రూ.50వేలు నుంచి రూ.లక్ష ఇస్తానని మొండిచేయి చూపించిందన్నారు. తెలుగుదేశం పార్టీతోనే మైనారిటీలకు న్యాయం జరుగుతుందన్నారు. అనంతరం షేక్ అమీర్‌బాషాను మైనారిటీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పొదలకూరు మండల టీడీపీ పట్టణ అధ్యక్షుడు బొద్దుకూరు మల్లికార్జున్‌నాయుడు, మనుబోలు మండల టీడీపీ నాయకుడు కోదండ రామిరెడ్డి, పొదలకూరు మైనారిటీ నాయకులు మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే చంద్రబాబు లక్ష్యం

కోవూరు, ఫిబ్రవరి 24: పేదల అభ్యున్నతే లక్ష్యంగా మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి సాగిస్తున్నారని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి అన్నారు. స్థానిక దళిత కాలనీలో శనివారం బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దళితుల అభ్యున్నతి కోసం టీడీపీ సాగించిన కృషి చరిత్రలో నిలచిపోతుందన్నారు. బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కరపత్రాల్ని ఇంటింటికీ తిరిగి అందజేశారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట టీడీపీ నాయకులు ఇంతా మల్లారెడ్డి, బాలరవి, ధారా విజయబాబు, తువ్వర ప్రవీణ్‌కుమార్, నాటకరాని వెంకట్, యాకసిరి హరిబాబు ఉయ్యూరు వేణు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలకు ప్రభుత్వ ప్రోత్సాహం కరువు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న రాజగోపాల్‌రెడ్డి

ముత్తుకూరు, ఫిబ్రవరి 24: గ్రామీణ క్రీడలకు ప్రభుత్వ ప్రోత్సాహం కరువైందని టీడీపీ సర్వేపల్లి నియోజకవర్గ సమన్వ యకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి విమర్శించారు. ముత్తుకూరులో శనివారం సెపక్‌తక్రా అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సెపక్‌తక్రా అంతర్ జిల్లాల పోటీలను ప్రారంభించారు. వైసీపీ ప్రభుత్వం మినీ స్టేడియం నిర్మిస్తామన్న హామీ అమలు కాలేదన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత స్టేడియం నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. జనసేన ఆధ్వర్యంలో క్రీడాకారులకు అల్పాహారం అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పల్లంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నీలం మల్లికార్జునయాదవ్, పట్టణ అధ్యక్షుడు బొలిగర్ల శ్రీనివాసులు, జనసేన సర్వేపల్లి నియోజకవర్గ నాయకులు బొబ్బేపల్లి సురేష్‌నాయుడు, భవానీ, సెపక్ తక్రా అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సరస్వతీ పూజ

పొదలకూరు, ఫిబ్రవరి 24: ఇంటర్ పరీక్షలు సమీపిస్తుండడంతో పట్టణంలోని విజ్ఞాన్ జూనియర్ కళాశాలలో శనివారం సరస్వతీదేవి పూజ విద్యార్థులు, అధ్యాపకులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక వాసవి కన్యకా పరమేశ్వరి మండపంలో శ్రీ కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాసాచార్యులు చేతుల మీదుగా కర స్పాండెంట్ మూలంరెడ్డి సుధాకర్, ప్రిన్సిపాల్స్ అన్నం సుబ్బారావు, జీఎన్‌రెడ్డి పర్యవేక్షణలో పూజ చేశారు. అనంతరం విద్యార్థులకు హాల్‌టికెట్లు, పరీక్ష అట్టలను అందించారు. ఆలయ చైర్మన్ అదూరు వెంకటసుబ్బులు మాట్లాడుతూ శ్రద్ధగా చదివి, అందరూ ఉత్తీర్ణులు కావాలని, మండల స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతి అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ ఇన్‌చార్జ్ కృష్ణ, ఎ చంద్రశేఖర్‌యాదవ్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదవాలి

వెంకటాచలం: మండలంలోని ఇస్కపాళెం ప్రాథమిక పాఠశాలలో శనివారం సరస్వతీ పూజ నిర్వహించారు. ఈసందర్భంగా వార్షికోత్సవ సంబరాలు ఘనంగా చేశారు. ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. ముఖ్యఅతిథిగా ఎంఈవో మధుసూదన్ విచ్చేసి మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యంతో ప్రణాళికాబద్ధంగా చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో నిడిగుంటపాళెం, గూడ్లూరువారిపాళెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు చలపతి, వెంకటరమణ, పాఠశాల కమిటీ చైర్మన్ మౌనిక, పాఠశాల హెచ్ఎం పార్వతీశం, ఉపాధ్యాయులు మాధవ్, కవిత, గ్రామస్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రైతు భరోసా కేంద్రం ప్రారంభం

పొదలకూరు, ఫిబ్రవరి 24 : మండలంలోని తాటిపర్తి గ్రామ పంచాయతీ పరిధిలోని నల్లపాలెం గ్రామంలో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ జేడీ సత్యవాణి, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సుబ్బారెడ్డి, ఏడీ శివనాయక్, ఏఓ గీత, పొదలకూరు తహసీల్దారు వీరవసంతరావు, ఎంపీడీఓ మహమ్మద్ రఫీ, జడ్పీటీసీ నిర్మలమ్మ, ప్రజా ప్రతినిధులు, పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

సైదాపురం, ఫిబ్రవరి 24: వేములచేడు, పాలూరు, లింగసముద్రం గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను శనివారం ఎంపీడీవో కార్యాలయ ఏవో పురుషోత్తం శివకుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాలపై బీఎల్వోలతో ఆరాతీశారు. అనంతరం వారికి పలు సలహాలు ఇచ్చారు. వీరి వెంట ఏఎస్ఐ నాగయ్య, బీఎల్వోలు సాయి, మెర్సీ, మాధవీలత, వీఆర్వో రఘు పాల్గొన్నారు.

నెల్లూరు సిటీ, రూరల్ కోవూరు, సర్వేపల్లి

లక్ష్మీనరసింహుడి నగరోత్సవం



పూజలందుకుంటున్న వేదగిరీశ్వరుడు

నెల్లూరు (హరనాథపురం), ఫిబ్రవరి 24 : నగరంలోని నవాబు పేటలో ఉన్న డీసీఎంఎస్ రైసు మిల్లులో వేదగిరి లక్ష్మీ నరసింహ స్వామికి శని వారం సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్ర సాదాలు పంచిపెట్టారు. అనంతరం నవాబు పేట, స్టోన్‌హౌస్‌పేట ప్రధాన వీధుల్లో వేదగిరీశ్వరుని నగరోత్సవం జరిగింది. ఈ కార్యక్రమా ల్లో భక్తులు అశేష సంఖ్యలో పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించు కున్నారు. ఐదేళ్లుగా డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఈ నగరోత్సవ, పూజా కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ వీరి చలపతిరావు, బిజినెస్ మేనేజర్ వెంకటస్వామి, వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఈవో గిరికృష్ణ, అర్చకులు కృష్ణమాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

రేపు సిద్ధి గణపతికి స్వర్ణకవచం సమర్పణ

నెల్లూరు(సాంస్కృతికం), ఫిబ్రవరి 24 : నగరంలోని పప్పులవీధి సిద్ధి విఘ్నేశ్వరస్వామికి ఈనెల 26న స్వర్ణకవచం సమర్పించనున్నట్లు నుడా చైర్మన్ ముక్కాల ద్వారకానాథ్ తెలిపారు. శనివారం ఆలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ స్వర్ణ కవచాన్ని పాండురంగ అన్నదాన సమాజం నుంచి శోభాయాత్ర బయలుదేరి స్టోన్‌హౌస్‌పేటలో ఊరేగింపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సాయంత్రం సిద్ధి విఘ్నేశ్వరస్వామికి అలంకరిస్తామని, అనంతరం కల్యాణం, పుష్పయాగం ఉంటుందన్నారు. ఈ సమావేశంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ బయ్యా ప్రసాద్, బాలాజీ, పాల్గొన్నారు.

టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థులకు సన్మానం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఫిబ్రవరి 24: టీడీపీ నెల్లూరు సిటీ, రూరల్ అభ్యర్థులుగా పొంగూరు నారాయణ, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిలను అధినేత నారా చంద్రబాబునాయుడు ప్రకటించారు. దీంతో ఆ ఇద్దరు నాయకులను శనివారం జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు.

రవీంద్రభారతిలో విజ్ఞాన ప్రదర్శన

నెల్లూరు (విద్య), ఫిబ్రవరి 24 : నగరంలోని నవాబుపేట రవీంద్రభారతి పాఠశాలలో శనివారం విజ్ఞాన ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీకే ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీ.గిరి ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థుల్లో శాస్త్రీయ పరిజ్ఞానం పెంపొందించేందుకు ఈ ప్రదర్శనలు ఎంతో దోహదం చేస్తాయన్నారు. పాఠశాల స్థాయి నుంచే వారిలోని ప్రతిభా పాటవాలు వెలికితీసి దేశానికి ఉపయోగపడేలా తీర్చిదిద్దాలని తెలిపారు. అనంతరం ప్రదర్శనలను తిలకించి విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్య కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ నరేంద్ర, ఇరిగేషన్ ఈఈ కె.వెంకటేశ్వర్లు, పాఠశాల జోనల్ ఇన్‌చార్జి శ్రీహరి, ప్రధానోపాధ్యాయిని నిరుపమ, సిబ్బంది, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

'ఓవెల్'లో..

నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 24 : నగరంలోని ఓవెల్ విన్‌లైట్ పాఠశాలలో శనివారం వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. విద్యార్థులు 400 రకాల ప్రాజెక్టులను ప్రదర్శించారు. గ్రూప్ డిస్కషన్స్, డిజిటల్ డెమో, గేమ్‌షో, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ గ్యాలరీ, కాయిన్స్ అండ్ కరెన్సీ కలెక్షన్, ఇతిహాసాలు, మ్యాథ్స్ మైండ్ రీడింగ్, ఇతర సాంస్కృతిక ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. డీకే మహిళా కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ టి.రంజని ప్రాజెక్టులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల సీఎండీ ఆర్.వేణు, సీఈవో ఆర్.ప్రమీల, జీఎం మహదేవన్, ఈడీ బాలు, డీజీఎం శ్రీనివాసయాదవ్, ప్రిన్సిపాల్ డి.జగన్నాథలక్ష్మి, ఇన్‌చార్జి శ్రీలక్ష్మి, ఏజీఎం ఫిరోజ్, కన్వీనర్లు శశికళ, స్వర్ణలత, సిబ్బంది, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగంపై చర్చా వేదిక

నెల్లూరు (సాంస్కృతికం): ఏ ట్రస్ట్ ఏ ఫర్ ఆల్ సంస్థ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం వర్ధమాన సమాజం సమావేశ మందిరంలో ఓటు హక్కు వినియోగంపై చర్చావేదిక జరిగింది. ఈ చర్చావేదికలో విరవు లక్ష్మీనరసింహ ప్రసాద్, శింగంశెట్టి మురళీమోహన్‌రావు, ఎ.జయప్రకాష్, రాచపాలెం రఘు, ఎ.రామమోహన్‌రావు, బి.శ్రీమన్నారాయణ, ఎం.రవీంద్ర, అళహరి వెంకటేష్, సంస్థ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మోడల్ ఓటర్ ప్రోగ్రెస్ కార్డును ఆవిష్కరించారు.

పది సీట్లూ గెలుస్తాం : నారాయణ



50వ డివిజన్‌లో మహిళ నుంచి సమస్యలు తెలుసుకుంటున్న పొంగూరు నారాయణ

నెల్లూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఉమ్మడి నెల్లూరు జిల్లాలో పదికి పది అసెంబ్లీ స్థానాలను టీడీపీ కైవసం చేసుకోబోతోందని మాజీ మంత్రి, టీడీపీ నెల్లూరు సిటీ అభ్యర్థి పొంగూరు నారాయణ జోస్యం చెప్పారు. శనివారం నెల్లూరులోని 51వ డివిజన్ బోసుబొమ్మ సెంటర్, నక్కలోళ్ల సెంటర్ ప్రాంతాల్లో బాబు ష్యూరిటీ- భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో నారాయణ పాల్గొన్నారు. ప్రతీ ఇంటికీ, దుకాణం వద్దకు వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రశాంత్, ప్రేమ్ ప్రశాంత్, బాలకృష్ణ, అరవ రాజేష్, మైఖేల్ పాల్గొన్నారు.

ఫ్యాన్ రెక్కలు విరిచేందుకు ప్రజలు సిద్ధం : అజీజ్

నెల్లూరు(వ్యవ సాయం), ఫిబ్రవరి 24 : సిద్ధం అంటూ జగన్‌రెడ్డి సభలు పెట్టి అశుద్ధపు మాటలు చెబుతున్నారని, ఫ్యాను రెక్కలు విరిచేందుకు ప్రజలు కసితో సిద్ధంగా ఉన్నారని టీడీపీ నెల్లూరు పార్లమెంటు నియోజక వర్గ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ పేర్కొన్నారు. నగరంలోని 52వ డివిజన్ ఇసుకడొంక, షానామహల్ ప్రాంతాల్లో శనివారం ఆయన బాబు ష్యూరిటీ, భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేసి నారాయణను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఇక్బాల్, యత్రబ్, పాషామొహిద్దీన్, షాహీనా, సుధీర్, చోటు, శిరీష తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆశీస్సులతో త్వరలో ప్రజాప్రభుత్వం

● టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి



కరపత్రాలు పంచుతున్న కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి

నెల్లూరు(వైద్యం), ఫిబ్రవరి 24 : ప్రజల ఆశీస్సులతో త్వరలో ప్రజా ప్రభుత్వం వస్తుందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి తెలిపారు. శనివారం కోటంరెడ్డి నగరంలోని 15వ డివిజన్‌లో బాబుష్యూరిటీ - భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ప్రజలను కలుసుకుని నారాయణను గెలిపించాలని టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రాన్ని వైసీపీ నుంచి కాపాడుకునేందుకు టీడీపీ - జనసేన ఉమ్మడి పోరాటం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు కేపీ చౌదరి, ఆకుల హనుమంతరావు, కమ్మ కళ్యాణి, బషీర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో పలువురి చేరిక



శ్రీధర్‌రెడ్డిని సత్కరిస్తున్న సుధాకర్‌రెడ్డి, తదితరులు

నెల్లూరురూరల్, ఫిబ్రవరి 24 : నెల్లూరురూరల్ మండలం పెనుబర్తి పంచాయతీ పల్లిపాళెంకు చెందిన తాండ్ర శీనయ్య, పెంచలయ్య, గండవరం మనోహర్‌ల మిత్ర బృందం సభ్యులు శనివారం టీడీపీలో చేరారు. నెల్లూరులోని రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి వారందరికీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే 23వ డివిజన్ పడారుపల్లిలో వైసీపీ ముఖ్యనేత పామూరు సుధాకర్‌రెడ్డి, తదితరులు కోటంరెడ్డి సోదరులను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన పార్టీల కూటమి ఘన విజయంతో అధికారాన్ని ఏర్పాటు చేయబోతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, కిలారి వెంకటస్వామినాయుడు, వెడిచర్ల వెంకటేశ్వర్లు యాదవ్, వెదనపర్తి వెంకటేశ్వర్లురెడ్డి, దినేష్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

పెండింగ్ సమస్యలు పరిష్కరించండి

● ఎన్ఎంసీ కమిషనర్ వికాస్ మర్మత్

నెల్లూరు(సిటీ), ఫిబ్రవరి 24 : ప్రజల నుంచి అందిన వివిధ సమస్యలను పెండింగ్‌లో లేకుండా నిర్ణీత కాలంలో పరిష్కరించాలని ఎన్ఎంసీ కమిషనర్ వికాస్‌మర్మత్ ఆదేశించారు. శనివారం నగరంలోని కోటమిట్ట, చిన్నబజార్, రామిరెడ్డివీధి సచివాలయాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందితో మాట్లాడుతూ పౌర సేవల పోర్టల్లో సమస్యలు పెండింగ్ ఉండకూడదన్నారు. ప్రభుత్వం నుంచి అందే సేవలు ప్రజలకు దగ్గర చేయాలని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరు సంక్షేమ పథకంలో ఉండాలని స్పష్టం చేశారు. పన్ను వసూళ్లపై దృష్టి సారించాలని ఆదేశించారు.

భక్తిశ్రద్ధలతో సత్యనారాయణ వ్రతం



మోహినీ అలంకారంలో ఆదికేశవస్వామి

నెల్లూరు(సాంస్కృతికం), ఫిబ్రవరి 24 : మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని మహాత్మ గాంధీనగర్ శ్రీకృష్ణ మందిరంలో రమాదేవి సమేత వీరవెంకట సత్యనారాయణ స్వామికి శనివారం సత్యనారాయణ వ్రతం కనుల పండువగా జరిగింది.

● మూలాపేట శంకరమఠంలో చండీయాగం జరిగింది. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

● నగరంలోని వీఆర్ హైస్కూల్ మైదానంలో 22వ అష్టలక్ష్మీ యాగం కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. పెరుమాళ్ ఆరాధన, అభిషేకం, అర్చనలు, బాలభోగనివేదన, మంగళ శాసనం, తీర్థప్రసాద గోష్ఠి, వేదవిన్నపాలు, హోమాలు, భజనలు, కీర్తనలు జరిగాయి. అష్టలక్ష్మీ పీఠం వ్యవస్థాపకులు పీతాంబరం రఘునాథచార్య స్వామి ఆధ్వర్యంలో ఉపదేశ పూర్వక ఆదిత్య హృదయ పారాయణం జరిగింది. లోకకల్యాణార్థం అందరికీ ఆయురారోగ్యాలు, మానసిక ఆరోగ్యం, ధన్వంతరి ఇష్టహోమం జరిగింది. అష్టలక్ష్మీ పీఠం ఆధ్వర్యంలో పెద్ద జీయారు స్వామి శిష్యులు ఇరగవరపు రామానుజాచార్యులు జ్ఞాపకార్థం ఏలూరు ఆర్ఆర్‌పేట శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయం ప్రధాన అర్చకులు కిడాంబి మారుతీ శ్రీనివాసరామానుజా చార్యులు, అంజనీ సుజాత దంపతులకు సన్మానం, అర్చక రత్న అవార్డు ప్రదానోత్సవం జరిగింది. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

● నవాబుపేట ఉదయవర్లు దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీదేవి భూదేవి ఆదికేశవస్వామిలకు ఉదయం విశేష పూజలు జరిగాయి. అనంతరం మోహినీ అవతారంలో ఆదికేశవస్వామి భక్తులను దర్శనమిచ్చారు. రాత్రి గరుడ వాహ నసేవ, పేట ఉత్సవం వైభవంగా జరిగింది.

● పప్పులవీధి పాండురంగస్వామి ఆలయంలో శ్రీపీఠం వ్యవస్థాపకులు లలితా శివకుమార్‌స్వామి ఆధ్వర్యంలో చండీ హోమం జరిగింది. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

కన్నన్‌కు డాక్టర్ బాలి మెమోరియల్ అవార్డు

నెల్లూరు(వైద్యం), ఫిబ్రవరి 24 : నారాయణ దంత వైద్య కళాశాల ఓరల్ మెడిసిన్ అండ్ రేడియాలజీ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్ కన్నన్‌కు కళాశాలలో నిర్వహించిన సేవలను గుర్తించి ఇంటర్నేషనల్ కాలేజీ ఆఫ్ డెంటిస్టు కార్యక్రమంలో డాక్టర్ ఎస్ఎల్ బాలి మెమోరియల్ అవార్డును ప్రదానం చేసింది. శనివారం ఢిల్లీలోని గురుగోవింద్‌సింగ్ ఇంద్రప్రస్థా యూనివర్సిటీలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కార్యదర్శి అపూర్వ చంద్ర చేతుల మీదుగా అందుకున్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ వీసీ డాక్టర్ మహేష్ వర్మ, తదితరులు పాల్గొన్నారు. నారాయణ దంత వైద్య కళాశాల వైద్యులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

టిడ్కో ఇళ్ల వద్ద తెలుగు యువత ఆందోళన

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): పూర్తయిన టిడ్కో గృహాలను లబ్ధిదారులకు జగన్ ప్రభుత్వం ఇవ్వకపోవడాన్ని నిరసిస్తూ తెలుగు యువత ఆధ్వర్యంలో శనివారం నగరంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించి భగత్‌సింగ్ కాలనీలోని టిడ్కో గృహాల వద్ద నిరసన తెలిపారు. టీడీపీ నేత వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో అప్పటి మంత్రి నారాయణ భారీ వ్యయంతో షష్రర్ టెక్నాలజీతో నిరుపేదల కోసం టిడ్కో గృహాలను నిర్మించారని, వాటిని లబ్ధి దారులకు ఇవ్వకుండా వైసీపీ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. తెలుగు యువత నాయకులు పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక ప్రభుత్వాన్ని గద్దెదించాలి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ప్రజావ్యతిరేక వైసీపీ ప్రభుత్వాన్ని గద్దెదించాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి పిలుపునిచ్చారు. నగరంలోని వెంకటేశ్వరపురంలో శనివారం బీజేపీ ప్రజాపోరు యాత్ర ప్రారంభమైంది. నారాయణరెడ్డి మాట్లాడుతూ ఈ నెల 24వ తేది నుంచి 29వ తేది వరకు ఈ యాత్ర జిల్లా వ్యాప్తంగా సాగుతుందన్నారు. బీజేపీ నాయకులు పి.సురేంద్రరెడ్డి, మిడతల రమేష్, వంశీధర్‌రెడ్డి, వెంకటేష్, మధు, భాస్కర్ పాల్గొన్నారు.

కార్పొరేషన్‌లో ముగ్గురికి పదోన్నతి

నెల్లూరు(సిటీ): కార్పొరేషన్‌లోని ఆరోగ్య విభాగంలో ఆరోగ్య సహాయకులుగా పని చేస్తున్న ముగ్గురికి పదోన్నతి కల్పిస్తూ కమిషనర్ వికాస్‌మర్మత్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆరోగ్య సహాయకులు కే గిరీష్‌కుమార్, టీ ఈశ్వరయ్య, షేక్ మహబూబ్ షరీఫ్‌లను శానిటరీ ఇన్‌స్పెక్టర్లుగా ఉద్యోగోన్నతి కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంహెచ్‌వో వెంకటరమణయ్య పాల్గొన్నారు.

నేత్రదానం



జయంతి (ఫైల్)

నెల్లూరు(వైద్యం), ఫిబ్రవరి 24 : నెల్లూరు నగరం జేమ్స్ గార్డన్‌కు చెందిన జయంతి (53) శనివారం మృతి చెందారు. మరణానంతరం మృతురాలి కుటుంబ సభ్యుల కోరిక మేరకు జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఐ డొనేషన్ కౌన్సిలర్ బాలాజీసింగ్, ఎల్‌వీ ప్రసాద్ ఐ హాస్పిటల్ టెక్నీషియన్ లాలేష్ మృతురాలి నేత్రాలను సేకరించారు. కుటుంబ సభ్యులకు నేత్రదాన సర్టిఫికెట్‌ను అందజేశారు. నేత్రదానం చేయదలచిన వారు 9948164781, 9347111033లను సంప్రదించాలని తెలిపారు.

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలుచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పత్రిక పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ కింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

నెల్లూరు ఏసీఎం	9985411424
నెల్లూరు ఏసీవో	9542727676
నెల్లూరు సిటీ	8179815202
నెల్లూరు రూరల్	8885688410
కోవూరు	8008894200



పంచమూర్తుల ఊరేగింపు

వేదోక్తంగా త్రిశూల స్నానం

కార్తీక శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని శనివారం శ్రీకాళహస్తిలో ఏటి ఉత్సవం వైభవంగా జరిగింది.స్వర్ణముఖి నదిలో త్రిశూల స్నానాన్ని వేదోక్తంగా నిర్వహించారు. వారం రోజుల ముందు నుంచే ముక్కంటి ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయానికి పక్కనే ఉన్న స్వర్ణముఖి నదిలో సద్యోముక్తి ప్రదేశాన్ని ముస్తాబు చేశారు. స్వామి అమ్మవార్ల మూల మూర్తులకు ఆలయంలో అభిషేకాలు నిర్వహించాక అలంకార మండపంలో పంచమూర్తులైన స్వామి, అమ్మవారు, వినాయక స్వామి, సుబ్రమణ్య స్వామి, చండీకేశ్వరుల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించారు. భక్తుల శివనామ స్మరణ మధ్య సద్యోముక్తి ప్రదేశానికి ఊరేగింపుగా తీసుకొచ్చారు.జీవుడు శివసాయుజ్యం పొందేందుకు ఆచరించాల్సిన సద్యోముక్తి వ్రతకల్పాన్ని వేద పండితులు వివరించారు.ముక్కంటి ఆలయ అనువంశిక ప్రధాన అర్చకులు డాక్టర్ స్వామినాథన్ గురుకుల్ కలశ స్థాపనతో సంకల్ప పూజలతో పాటు త్రిశూలానికి విశేష పూజలు చేశారు. నదీ జలంలో త్రిశూల స్నానం నిర్వహించేటప్పుడు భక్తులు పుణ్యస్నానాలాచరించారు.అనంతరం చతుర్మాడ వీధుల్లో పంచమూర్తుల ఊరేగింపు వేడుకగా జరిగింది. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన రెడ్డి, ఆర్టీసీ వైస్ చైర్మన్ మిద్దెల హరి, ఆలయ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, ఈవో నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



త్రిశూల స్నానం

- శ్రీకాళహస్తి





అట్టహాసంగా తిరుపతి జన్మదినం

● ఇకపై ఏటా టీటీడీ నిర్వహిస్తుందన్న భూమన

ఆధ్యాత్మిక క్షేత్రమైన తిరుపతి నగర 894వ పుట్టినరోజు వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి.గోవిందరాజస్వామి గుడి మాడవీధుల్లో వివిధ కళాబృందాల సందడి నడుమ ఉత్సవాన్ని ప్రారంభించిన టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి మాట్లాడుతూ.. క్రీ.శ. 1130 ఫిబ్రవరి 24వ తేదీన గోవిందరాజ స్వామి విగ్రహప్రతిష్ఠ జరిగిందని, ఆ రోజే రామానుజాచార్యులు తిరుపతి పుట్టుకకు శ్రీకారం చుట్టారని తెలిపారు. ఇకపై ఏటా తిరుపతి పుట్టిన రోజు వేడుకను టీటీడీ అధికారికంగా నిర్వహిస్తుందని, ఈ మేరకు టీటీడీ క్యాలెండర్లో పొందుపరచడానికి పాలక మండలి తీర్మానిస్తుందని ప్రకటించారు.ఈ సందర్భంగా నిర్వహించిన శోభాయాత్రలో టీటీడీకి చెందిన ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టు, దాస సాహిత్య ప్రాజెక్టుకు చెందిన వందలాది కళాకారులు పాల్గొన్నారు. ప్రదర్శనగా సాగిన కోలాటాలు, చెక్కభజనలు, గోవింద నామ సంకీర్తనా బృందాలు నగరవాసులకు కనువిందుచేశాయి.టీటీడీ జీయర్ స్వాములు,ఈవో ధర్మారెడ్డి,కలెక్టర్ లక్ష్మీశా, ఎస్పీ మలిక గార్గ్, మేయర్ శిరీష, ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం, డిప్యూటీ మేయర్ అభినయ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





- తిరుపతి (కల్చరల్)

సమర్థతకు, యువతకు ప్రాధాన్యం

ఎన్నో రోజులుగా పార్టీ శ్రేణులు, రాజకీయ వర్గాలతో పాటు సామాన్య జనం కూడా ఆత్రుతగా ఎదురుచూస్తున్న తెలుగుదేశం పార్టీ తొలి అభ్యర్థుల జాబితా శనివారం వెలువడింది. జిల్లా నుంచీ గూడూరు అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్‌ను, సూళ్ళూరుపేట అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రమణ్యం కుమార్తె డాక్టర్ విజయశ్రీని అధిష్ఠానం ప్రకటించింది. జిల్లాలో మొత్తం ఏడు నియోజకవర్గాలుండగా తొలి జాబితాలో రెండు చోట్ల మాత్రమే అభ్యర్థులను ప్రకటించారు. సమర్థతకు, యువతకు అధిష్ఠానం ప్రాధాన్యత ఇచ్చిందని తొలి జాబితా వెల్లడిస్తోంది.తొలి జాబితాలో చోటు దక్కని మిగిలిన ఐదు స్థానాల గురించే ప్రధానంగా జనంలో చర్చ నడుస్తోంది.

- తిరుపతి,ఆంధ్రజ్యోతి

● రెండు స్థానాలకు టీడీపీ అభ్యర్థుల ప్రకటన ● మిగిలిన స్థానాలను పెండింగ్ పెట్టడంపై చర్చ



గూడూరుకు పాశిం సునీల్ కుమార్

గత ఎన్నికల్లో ఓటమి చెందినప్పటికీ నిత్యం శ్రేణులతో వుంటూ జనం మధ్యే గడిపిన పాశిం సునీల్ కుమార్‌కు న్యాయం జరిగింది.ఎక్కడా శ్రేణుల్లో అసంతృప్తికి అవకాశమివ్వకుండా, జనం సమస్యలపై పోరాడిన సునీల్ కుమార్ తీరు మళ్ళీ టికెట్ దక్కేలా చేసింది. గూడూరులోనే నివాసముండడం, నిరంతరం పార్టీ శ్రేణులకు, ప్రజలకు అందుబాటులో వుండడం,పార్టీ కార్యక్రమాలను పూర్తిశక్తియుక్తులతో చేపట్టడం కూడా ఆయన పట్ల పార్టీలో మంచి అభిప్రాయం ఏర్పడేందుకు కారణమైంది. వర్గాలకు తావివ్వకుండా అందరినీ కలుపుకుని పోవడం, అందరికీ సమాన ప్రాధాన్యత ఇవ్వడంతో శ్రేణుల్లో, ద్వితీయ శ్రేణి నాయకుల్లో అసంతృప్తికి అవకాశం లేకుండా చేసింది. వీటితో పాటు గూడూరు టికెట్ కోసం ఇతరులెవరూ రేసులో లేకపోవడం కూడా ఆయనకు కలసి వచ్చింది. జాబితాలో ఆయన పేరు రావడంతో నియోజకవర్గవ్యాప్తంగా పార్టీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నాయి.

నారా లోకేశ్‌కు రుణపడివుంటా

నాపై నమ్మకం ఉంచి టికెట్ కేటాయించినందుకు యువనేత నారా లోకేశ్‌కు రుణపడి ఉంటా.వైసీపీ అధికారంలోకి వచ్చాక 15అక్రమ కేసులు పెట్టినా భయపడకుండా పార్టీ కోసం పనిచేశా. అంకితభావంతో పనిచేసేవారికి టీడీపీ అండగా నిలుస్తుందని చెప్పేందుకు ఈ రోజు నాకు టికెట్ కేటాయించడమే నిదర్శనం.మొదటి జాబితాలోనే 18మంది ఎస్సీలకు టిక్కెట్ కేటాయించారంటే దళితులకు చంద్రబాబు ఎంతటి గౌరవం ఇస్తారో మరోసారి వెల్లడైంది.

- పాశిం సునీల్‌కుమార్

సూళ్ళూరుపేటకు డాక్టర్ విజయశ్రీ

సూళ్ళూరుపేట అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రమణ్యం కుమార్తె డాక్టర్ విజయశ్రీని అదృష్టం వరించింది. వాస్తవానికి ఇక్కడ నెలవల సుబ్రమణ్యంతో పాటు మాజీ మంత్రి పరసా రత్నం కూడా టికెట్ కోసం గట్టిగా ప్రయత్నించారు.రత్నం 2014, 2019 ఎన్నికల్లో ఓడిపోవడంతో పాటు గత ఎన్నికల అనంతరం పార్టీలో చురుకైన పాత్ర పోషించలేదు. అదే సమయంలో నెలవల సుబ్రమణ్యం టికెట్ రాకున్నా నాలుగున్నరేళ్ళుగా చురుగ్గా పనిచేస్తున్నారు. తనకు కాకుంటే తన కుమారుడు లేదా కుమార్తెల్లో ఒకరికి అవకాశం ఇవ్వాలని ఆయన చంద్రబాబును కోరారు. యువతకు ప్రాధాన్యమివ్వాలని భావించిన అధినేత విజయశ్రీవైపు మొగ్గు చూపారు. మహిళ, వైద్యురాలు కావడం ఆమెకు అనుకూలించింది. విద్యాధికురాలైన యువతికి టికెట్ ఇవ్వడం జనంలో పార్టీ ఇమేజిని పెంచినట్టయింది.

ఆ ఐదు స్థానాలపై చర్చ

టీడీపీ ఐదు స్థానాలను పెండింగులో వుంచడం జనంలో చర్చకు దారి తీసింది. తిరుపతి, శ్రీకాళహస్తి వంటి జనసేన, బీజేపీలతో పొత్తు బంధం ముడివేసుకున్న స్థానాలను పక్కన పెడితే పెద్దగా సమస్య లేని వెంకటగిరి, సత్యవేడు, చంద్రగిరి వంటి స్థానాలను కూడా పెండింగ్ పెట్టడం విస్మయానికి గురి చేసింది. తిరుపతిలో బలిజ సామాజికవర్గం అధికంగా వున్నందున తొలి నుంచీ ఈ స్థానాన్ని జనసేనకు కేటాయిస్తారన్న అంచనా ఇరు పార్టీల్లోనూ వుంది. అయితే జనసేనకు బలమైన అభ్యర్థి లేకపోవడంతో టీడీపీ నుంచే ఉమ్మడి అభ్యర్థి బరిలో వుంటారన్న అంచనా మొదలైంది. దీంతో ఈ స్థానం పెండింగు పడడం అర్థం చేసుకోదగిందే.శ్రీకాళహస్తిలో టీడీపీ వైపు నుంచీ బొజ్జల సుధీర్‌రెడ్డి అభ్యర్థిత్వం విషయంలో అనుమానాలేమీ లేవు. అయితే టీడీపీకి బీజేపీతో పొత్తు కుదిరే అవకాశమున్న సంగతి తెలిసిందే. ఇక్కడ బీజేపీకి కోలా ఆనంద్ బలమైన నాయకుడిగా వున్నారు. దీంతో పొత్తు కుదిరితే బీజేపీ ఈ సీటు అడిగేందుకు ఆస్కారమున్నందున శ్రీకాళహస్తి టికెట్ పెండింగ్‌లో పడింది. వెంకటగిరి విషయానికొస్తే టికెట్ కోసం ఇంచార్జిగా వున్న మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, సిట్టింగ్ ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి, బీసీ నేత మస్తాన్ యాదవ్ రేసులో వున్నారు. వీరిలో ఎవరికి టికెట్ ఇవ్వాలన్నా మిగిలిన ఇద్దరికీ సర్దిచెప్పాల్సి వుంది. అందుకే తొలి జాబితాలో వెంకటగిరికి తావు లేకుండా పోయింది. సత్యవేడులోనూ ఇదే పరిస్థితి. ఇంచార్జి డాక్టర్ హెలెన్, మాజీ ఎమ్మెల్యేలు హేమలత, తలారి ఆదిత్య, జేడీ రాజశేఖర్ తదితరులు టికెట్ రేసులో వున్నారు. అభ్యర్థిగా ఎవరిని నిర్ణయించినా మిగిలిన వారిని బుజ్జగించాల్సిన అవసరముంది. అందుకే ఈ సీటు కూడా తొలి జాబితాలో కనిపించలేదు.చంద్రగిరి విషయానికొస్తే రకరకాల సమీకరణలు కనిపిస్తున్నాయి. గత ఎన్నికల్లో పోటీ చేసిన పులివర్తి నానీ ఓటమి చెందినా నియోజకవర్గంలో చురుగ్గా పనిచేస్తున్నారు. ఓటర్ల జాబితాలో అక్రమాలు జరిగాయని పెద్దఎత్తున పోరాడుతున్నారు. కుటుంబసభ్యులంతా జనంలోనే వుంటున్నారు. యువగళం పాదయాత్రలో నారా లోకేశ్ చంద్రగిరి నుంచీ పులివర్తి నానీని గెలిపించాలని శ్రేణులకు, ప్రజలకు కూడా పలుసార్లు పిలుపిచ్చారు. తొలి జాబితాలో నానీ పేరు ప్రకటిస్తారన్న అంచనాలు కూడా శ్రేణుల్లో వుండేవి. కానీ అలా జరగలేదు. తొలి జాబితాలో సెంటిమెంట్ కారణంగా 99 సంఖ్యకు ప్రాధాన్యత ఇచ్చారని, అందువల్లే మరిన్ని స్థానాల్లో స్పష్టత వున్నప్పటికీ జాబితాలో ప్రకటించలేదన్న వాదన పార్టీ వర్గాల నుంచీ వినిపిస్తోంది.



24 గంటలూ అందుబాటులో ఉంటా

నా అభ్యర్థిత్వానికి మద్దతు పలికిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు.గెలిచి అందరి నమ్మకాన్నీ నిలబెడతా.నియోజకవర్గ ప్రజలకు 24గంటలూ అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా. ఈ ఎన్నికల్లో చంద్రబాబును మరోమారు ముఖ్యమంత్రి చేసుకునేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు. గతంలో టీడీపీకి వచ్చిన మెజార్టీ కన్నా రెండింతలు ఈ ఎన్నికల్లో సాధించేందుకు కృషి చేస్తాం.

- నెలవల విజయశ్రీ





ఆలయం వద్ద ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లతో వచ్చిన వాహనం - వాహనంలోని ప్లాస్టిక్ బాటిళ్లు, వాటిపై అధికారపార్టీ నేతల ఫొటోలు

ఇదేనా ప్లాస్టిక్ నిషేధం..!

● నిబంధనలకు విరుద్ధంగా తిరుమల చేరిన వాటర్‌బాటిళ్లు

● వాటిపై అధికార పార్టీ నేతల ఫొటోలు

తిరుమల, ఫిబ్రవరి24(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణలో భాగంగా టీటీడీ కొన్నేళ్ల క్రితమే ప్లాస్టిక్ వాటర్ బాటిళ్ల,కవర్ల విక్రయాన్ని తిరుమలలో నిషేధించిన విషయం తెలిసిందే. భక్తులెవరైనా తెలియకుండా తీసుకువస్తే అలిపిరి వద్ద తనిఖీల్లోనే సిబ్బంది స్వాధీన పరుచుకుంటారు. అయితే కొందరు వీఐపీలు ఇవేవీ తమకు వర్తించవనే రీతిలో ప్లాస్టిక్ బాటిళ్లను తరచూ తిరుమలకు తీసుకొస్తూనే వున్నారు. అధికారులు, సిబ్బంది కూడా వీఐపీ కార్లలో, గదుల్లో ప్లాస్టిక్ బాటిళ్లను గుర్తించినప్పటికీ చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు. తాజాగా 'ప్రధాన సలహాదారులు - రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయశాఖ' అనే బోర్డుతో ఉన్న కారులో ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లు ప్రత్యక్షమయ్యాయి. పైగా నిబంధనలకు విరుద్ధంగా అధికారపార్టీ నాయకుల ఫొటోలు, సిద్ధం అనే నినాదంతో కూడిన సీఎం ఫొటోలు ఆ వాటర్ బాటిళ్లపై ఉండడం గమనార్హం. కారుపై ప్రోటోకాల్ అనే బోర్డు కూడా ఉండటంతో భద్రతాధికారులు నిబంధనలను మరిచిపోయారు. రాజకీయ పార్టీల గుర్తులు, జెండాలు, కరపత్రాలు, వ్యక్తుల ఫొటోలతో తిరుమలకు రావడం నిషేధం. పైగా ప్లాస్టిక్‌ను కూడా నిషేధించినప్పటికీ ఆ వాహనం నేరుగా ఆలయం వద్దకే రావడం చర్చనీయాంశమైంది.

గ్రూప్-2 పరీక్షలకు సర్వం సిద్ధం

● 27,894మంది అభ్యర్థులకు 61 కేంద్రాల్లో ఏర్పాట్లు

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 24 : జిల్లాలో ఆదివారం నిర్వహించనున్న గ్రూప్-2 పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. 61 కేంద్రాల్లో జరగనున్న పరీక్షలకు 27,894మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. పరీక్షా కేంద్రాల్లో జిల్లా యంత్రాంగం మౌలిక వసతులు కల్పించింది. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంటల వరకు తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట, శ్రీకాళహస్తి, పుత్తూరు, కోట, గూడూరు కేంద్రాల్లో పరీక్షలు జరుగుతాయి. 31మంది జిల్లా అధికారులను రూట్ ఆఫీసర్లగా, 61మందిని చీఫ్ సూపరింటెండెంట్లుగా నియమించారు. ఉదయం 9.30గంటలకల్లా అభ్యర్థులు వారికి కేటాయించిన పరీక్ష కేంద్రాల వద్దకు చేరుకోవాల్సి ఉంటుంది. హాల్‌టిక్కెట్‌తో పాటు ఏదైనా గుర్తింపుకార్డు తీసుకురావాల్సి ఉంటుంది. సెల్‌ఫోన్స్, ఎలక్ట్రానిక్స్ వస్తువులు అనుమతించరు. ఒకవేళ ఎవరైనా తీసుకువస్తే పరీక్ష కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌లో భద్రపరిచే విధంగా అధికారులు ఏర్పాటు చేశారు. విద్యుత్ అంతరాయం జరగకుండా చూడాలని, పరీక్షా కేంద్రాల వద్ద తాగునీరు, ఓఆర్ఎస్, మెడికల్ కిట్‌తో పాటు ఒక ఏఎన్ఎంను ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. విభిన్న ప్రతిభావంతులైన అభ్యర్థులకు అదనంగా సమయం ఉంటుందని తెలిపారు. నిమిషం ఆలస్యమైనా లోనికి అనుమతించేది లేదని స్పష్టం చేశారు.



ఎస్వీడబ్ల్యూ కళాశాలలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

87 కేంద్రాల్లో ఇంటర్ పరీక్షలు

హాల్ టికెట్లపై ప్రిన్సిపాల్ సంతకం అవసరంలేదన్న ఆర్ఐవో

తిరుపతి(విద్య),ఫిబ్రవరి 24 : మార్చి ఒకటో తేదీ నుంచి ప్రారంభం కానున్న ఇంటర్మీడియట్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆర్ఐవో జీవీ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. తిరుపతిలోని ఎస్వీ జూనియర్ కళాశాలలో శనివారం పరీక్షల నిర్వహణపై సీఎస్‌లు, డీవోలు, కస్టోడియన్లతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు.ఒకటిన ప్రథమ ఇంటర్, 2న ద్వితీయ ఇంటర్ పరీక్షలు ప్రారంభమవుతాయని, 87 కేంద్రాల్లో 63,250మంది విద్యార్థులు హాజరుకానున్నారని తెలిపారు. హాల్‌టికెట్లు ఇంటర్‌బోర్డు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని, వాటిపై ప్రిన్సిపాల్ సంతకం అవసరం లేదని తెలిపారు. విద్యార్థులకు ఏమైనా ఇబ్బందులు తలెత్తితే ఆర్ఐవో కార్యాలయంలోని టోల్‌ఫ్రీ నెంబరు 0877-2237200కి ఫోన్ చేయాలని కోరారు. డీవీఈవో విశ్వనాథనాయక్,డీఈసీ సభ్యులు గోపాల్‌రెడ్డి, రఘుపతి,తులసీరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రయాణికులకు ముఖ్య గమనిక

రేపు శాంతిపురంలో సీఎం సభ

బస్సు ప్రయాణాలను వాయిదా వేసుకుంటే మంచిదంటున్న విశ్లేషకులు

ప్రయాణికులకు ముఖ్య గమనిక. ఎవరైనా సోమవారం ప్రయాణాలు పెట్టుకుని ఉంటే.. వాయిదా వేసుకోవడమే మంచిది. లేదంటే బస్టాండ్లలో పడిగాపులు పడాల్సిందే. ఎందుకంటే శాంతిపురం మండలం గుండిశెట్టిపల్లెలో సీఎం జగన్ బహిరంగ సభ ఉంది. అత్యధిక బస్సులన్నీ అటువైపే వెళ్తాయి. రాష్ట్రంలో సీఎం జగన్ సభ అంటేనే ప్రయాణికులు బెంబేలెత్తే పరిస్థితి. పార్టీ సభ అయినా, ప్రభుత్వ కార్యక్రమమైనా నలుమూలల నుంచి జనాలను తరలించడం పరిపాటిగా మారింది. దీనికోసం ఆర్టీసీ, ప్రైవేటు, స్కూల్ బస్సులను ముందు రోజే స్వాధీనం చేసుకుంటున్నారు. ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ఇక స్కూళ్లకైతే సెలవు ప్రకటించాల్సిందే. ఇటీవల రాప్తాడు సభకూ ఆర్టీసీ బస్సులను మళ్లించడంతో రెండు రోజుల పాటు జిల్లాలోని ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ క్రమంలో సోమవారం శాంతిపురం మండలంలో సీఎం జగన్ సభ ఖరారైంది. దీంతో చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య, సత్యసాయి, కడప జిల్లాల నుంచి సుమారు 900 ఆర్టీసీ బస్సులను కేటాయించారు. అలాంటప్పుడు సాధారణ ప్రజలు ప్రయాణించేందుకు బస్సులు ఎక్కడుంటాయి? అందుకే ప్రయాణాలను వాయిదా వేసుకుంటే మంచిదంటున్నారు విశ్లేషకులు.

- చిత్తూరు రూరల్

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

టీడీపీతోనే మహిళా సాధికారత


కార్యక్రమంలో మాట్లాడుతున్న రవి నాయుడు

డక్కిలి, ఫిబ్రవరి 24: టీడీపీతోనే మహిళా సాధికారత సాధ్యమని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవి నాయుడు అన్నారు. స్థానిక కాకతీయ డిగ్రీ కళాశాలలో తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి కేవీకే ప్రసాద్ నాయుడు ఆధ్వర్యంలో శనివారం మై ఫస్ట్ ఓట్ ఫర్ సీబీఎన్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రవి నాయుడు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ మహిళలకు ఆస్తిలో సమాన హక్కు ఎన్టీఆర్ కల్పించగా, ఆయన స్ఫూర్తితో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మహిళా సాధికారతే లక్ష్యంగా రాష్ట్రంలో సుపరి పాలన అందించారని చెప్పారు. రాష్ట్ర అభివృద్ధి కోసం అహర్నిశలు పాటు పడే చంద్రబాబు నాయుడిని ముఖ్యమంత్రిగా చేయడానికి యువత తమ తొలి ఓటును టీడీపీ అభ్యర్థులకు వేయాలని కోరారు. తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు కృష్ణా యాదవ్ మాట్లాడుతూ యువతీ యువకులకు ఓటు హక్కు ప్రాధాన్యంపై అవగాహన కల్పించారు. విజన్ వున్న నాయకుడు చంద్రబాబును మళ్లీ ముఖ్యమంత్రిని చేస్తే రాష్ట్రం అభివృద్ధి బాటలో దూసుకుపోతుందన్నారు. కార్యక్రమంలో తెలుగు యువత మండల అధ్యక్షుడు కిషోర్ నాయుడు, టీఎన్ఎస్ఎఫ్ తిరుపతి పార్లమెంటు నిర్వాహక కార్యదర్శులు హేమంత్ చౌదరి, సుకుమార్, శివతేజ, పకీరుగారి నాని తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మాఘపౌర్ణమి వేడుకలు


కలశాలను తీసుకెళ్తున్న భక్తులు

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 24: సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ ఆలయంలో శనివారం మాఘ పౌర్ణమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. 108 క్షీర కలశాలను వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ అమ్మవారి ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు. అనంతరం ఆలయంలో ప్రతిష్టించి ప్రాకోరోత్సవం జరిపారు. అనంతం కలశాలతో అమ్మవారికి క్షీరాభిషేకం నిర్వహించారు. పౌర్ణమి సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ఉన్న యాగశాల మండపంలో మహా చండీయాగం నిర్వహించారు. ఉయభకర్తలుగా చెరుకుపల్లి రామ్‌కుమార్, శ్రీలక్ష్మి దంపతులు వ్యహరించారు. ఈ కార్యక్రమంలో సహాయ కమిషనర్ వెంకటేశ్వర్లు, పాలక మండలి సభ్యులు బాల సత్యనారాయణ, బండి సునీత, ముప్పాళ్ల చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కోదండరామస్వామి ఆలయ కుంభాభిషేకం


ఆలయానికి కలశం తీసుకెళ్తున్న పురోహితులు, అశోక్‌రాజు


ప్రత్యేకాలంకరణలో కోదండరామస్వామి

విజయపురం, ఫిబ్రవరి 24: విజయపురంలో శనివారం కోదండరామస్వామి ఆలయ మహాకుంభాభిషేకం వైభవంగా జరిగింది. సిద్ధార్థ గ్రూపు విద్యాసంస్థల చైర్మన్ కొండూరు అశోక్‌రాజు, ఇందిరవేణి దంపతుల ఆధ్వర్యంలో గ్రామస్తుల సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. శిల్పి మోహన్, శిష్య బృందంచే శ్రీరామ, లక్ష్మణ, హనుమంత, లక్ష్మీహైగ్రీవ విగ్రహాలను సిద్ధం చేసి అంకురార్పణ చేశారు. ఆలయ ఆవరణలో విగ్రహ ప్రతిష్ఠ, కలశపూజ, పూర్ణాహుతి, హోమం, పూర్ణకుంభం, మహాసంప్రోక్షణ ప్రతిష్ఠ, అష్టబంధన, పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం జరిగింది. సీతారాముల విగ్రహాలను ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఎనిమిది రాష్ట్రాల పురోహితులు, ఆలయ పురోహితుడు వందవాసి మహేశ్‌శర్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.

గుడిలో చోరీ

తడ, ఫిబ్రవరి 24: మండల పరిధిలోని ఎన్ఎంకండ్రిగ వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో శుక్రవారం రాత్రిచోరీ జరిగింది. శనివారం ఉదయం గ్రామస్తులు గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఒక ఆంప్లిఫేర్, హుండీలోని కొంత నగదు చోరీకి గురైనట్లుగా ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా సుదర్శన యజ్ఞం

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 24: స్థానిక బాలాంజనేయ స్వామి ఆలయంలో శనివారం సుదర్శ మహాయజ్ఞం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక హోమగుండం ఏర్పాటు చేసి సీతా, రామ, లక్ష్మణులతో పాటు హనుమంతుని ఉత్సవమూర్తులను ఆలయం చుట్టూ ప్రదక్షిణగా తీసుకొచ్చి హోమగుండం ముందు కొలువుదీర్చారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ సుదర్శన హోమం నిర్వహించారు. ఆలయ చైర్మన్ అయితా శ్రీధర్, ప్రధాన అర్చకులు దీవి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

సూళ్లూరుపేట బరిలో టీడీపీ నుంచి తొలిసారి మహిళ


విజయశ్రీ

తడ, ఫిబ్రవరి 24: సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా నెలవల విజయశ్రీని టీడీపీ అధిష్ఠానం ప్రకటించింది. శనివారం టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు పార్టీ అభ్యర్థుల మొదటి జాబితాను విడుదల చేశారు. సూళ్లూరుపేట నుంచి నెలవల విజయశ్రీని అభ్యర్థిగా నిర్ణయిస్తూ ప్రకటన చేశారు. మాజీ ఎంపీ, నియోజకవర్గ ప్రస్తుత ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం కుమార్తె విజయశ్రీ. నెల్లూరు నారాయణ కాలేజీలో వైద్య విద్యను అభ్యసించిన ఆమె ప్రస్తుతం తిరుపతిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో డాక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఆమెకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. కరోనా సమయంలో భర్త రవిచంద్ర మృతి చెందడంతో తిరుపతికి చెందిన పార్థసారథిని ఇటీవలే రెండో వివాహం చేసుకున్నారు. నియోజకవర్గంలో గ్రూపు రాజకీయాలు, వర్గ విభేదాలను దృష్టిలో ఉంచుకొని చేసిన సర్వేలో సైతం విజయశ్రీకే అనుకూలం ఫలితం వచ్చినట్లు తెలిసింది. దీంతో అధిష్ఠానం ఆమె వైపే మొగ్గుచూపింది. వాస్తవంగా నెలవల సుబ్రహ్మణ్యంకు టిక్కెట్ ఇస్తారంటూ గతంలో ప్రచారం జరిగింది. అయితే ఆయన ఆరోగ్య పరిస్థితులను సైతం దృష్టిలో ఉంచుకోవడంతో పాటు సర్వే సైతం ఆమెకు అనుకూలంగా ఉండటంతో ఆమె పేరే నిర్ణయించినట్లుగా సమాచారం. అయితే ఈ నిర్ణయంపై వేనాటి వర్గం ఏ విధంగా స్పందిస్తుందో వేచి చూడాల్సిందే. పార్టీ ఆవిర్భావం నుంచి ఇక్కడ అభ్యర్థుల నిర్ణయం అంతా వేనాటి వర్గానిదే. అధిష్ఠానం సైతం వారి మాటకే విలువిచ్చేది. కానీ ఈ దఫా వారి మాటలను అధిష్ఠానం పరిగణలోకి తీసుకోలేదని తెలుస్తోంది. మొదటి నుంచి నెలవల అభ్యర్థిత్వాన్ని వేనాటి వర్గం వ్యతిరేకిస్తుంది. దీంతో వారి తదుపరి కార్యచరణ ఏ విధంగా ఉంటుందోనన్న చర్చసాగుతోంది. మరో వైపు 1994 నుంచి 2019 వరకు టీడీపీ అభ్యర్థిగా పరసారత్నం ఆరు దఫాలు పోటీచేయగా మూడు సార్లు విజయం సాధించారు. ఆయన సైతం టిక్కెట్ కోసం విశ్వప్రయత్నాలు చేశారు. అయితే అధిష్ఠానం గెలుపే ధ్యేయంగా అభ్యర్థిని నిర్ణయించినట్లుగా తెలుస్తోంది.

సంబరాల్లో టీడీపీ శ్రేణులు: తొలి జాబితాలో నెలవల విజయశ్రీకి టిక్కెట్ కేటాయించడంతో తెలుగు తమ్ముళ్లల్లో జోష్ కన్పించింది. నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని మండలాల్లో బాణసంచ కాలుస్తూ మిఠాయిలు పంచిపెట్టి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. శనివారం సాయంత్రం నాయుడుపేట పార్టీ కార్యాలయానికి వచ్చిన విజయశ్రీకి నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. తనకు టికెట్ కేటాయించిన టీడీపీ అధినేత చంద్రబాబుకు, సహకరించిన స్థానిక నేతలు రామచంద్రారెడ్డి, కొండేపాటి గంగాప్రసాద్, శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డికు విజయశ్రీ కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటానని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు.

ఇసుక తవ్వకాలతో అడుగంటుతున్న భూగర్భజలాలు: పాశం


మెట్టు స్వర్ణముఖి నది వద్ద స్థానికులతో కలిసి నిరసన తెలుపుతున్న సునీల్‌కుమార్

చిట్టమూరు, ఫిబ్రవరి 24: స్వర్ణముఖి నదిలో ఇసుక తవ్వకాలతో భూగర్భజలాలు అడుగంటుతున్నాయని, దీంతో రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీరు అందడంలేదని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ అన్నారు. ఇసుక తవ్వకాలను వ్యతిరేకిస్తూ శనివారం స్వర్ణముఖి నది వద్ద నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అక్రమ ఇసుక తవ్వకాలతో కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా 500 వందల రీచ్‌ల్లో ఈసీలు లేకుండా వైసీపీ నేతల కనుసన్నల్లో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నారని తెలిపారు. టీడీపీ అమలు చేసిన ఉచిత ఇసుక విధానాన్ని రద్దు చేసిన ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. స్వర్ణముఖి నదిలో ఇసుక తవ్వకాలతో భూగర్భజలాలు అడుగంటిపోయి ఇటు రైతులు, అటు ప్రజలు సాగు, తాగునీరు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఇసుక అక్రమ తవ్వకాలు నిజమని తెలుస్తూ ఆధారాలతో కమిటీ కేంద్రానికి నివేదిక ఇచ్చినా దోపిడీ ఆపలేదన్నారు. రానున్న ఇసుక రవాణాను ప్రజలే అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ గణపర్తి కిషోర్‌నాయుడు, కోట మండల నాయకులు సర్వోత్తమ రెడ్డి, జనార్దనరెడ్డి, నల్లారెడ్డి రాజేష్‌రెడ్డి, కాపులూరు చెంచురామయ్య, మధుయాదవ్, తీగల సురేష్, జలీల్ అహ్మద్, మోహన్‌రెడ్డి, కల్లూరు మణి, రషీద్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీని అంతమొందించాలి: పాశం

చిల్లకూరు, ఫిబ్రవరి 24: అరాచకపాలన సాగిస్తూ రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన వైసీపీ ప్రభుత్వాన్ని అంతమొందించాలని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. శనివారం చిల్లకూరు మండలంలోని ఏరూరు గ్రామంలో బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో అందరం కలిసిట్టుగా పనిచేసి టీడీపీ గెలుపునకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లురెడ్డి, సన్నారెడ్డి వెంకటరమణారెడ్డి, గుండాల లీలావతి, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, నెల్లటూరు చిరంజీవి, అన్నం మునిశేఖర్ గౌడ్, మూగ శంకరయ్య, వెంకటకృష్ణయ్య, కుమార్‌యాదవ్, సుప్రజ, దయానంద రెడ్డి, ఉడతా శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రామ్మోహనరావుకు నివాళి


రామ్మోహనరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నెలవల, పరసారత్నం

ఓజిలి, ఫిబ్రవరి 14: అంకిత భావం, నిబద్ధత కలిగిన నాయకుడు కంకణాల రామ్మోహనరావును టీడీపీ కోల్పోయిందని మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పరసా రత్నం అన్నారు. ఈనెల 12న రామ్మోహనరావు అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే. శనివారం ఓజిలిలోని రామ్మోహనరావు గార్డెన్స్‌లో సంస్మరణ సభ జరిగింది. ఆయన చిత్రపటానికి పలువురు నాయకులు నివాళులర్పించారు. పార్టీకి ఆయన చేసిన సేవలను కొనియాడారు. రామ్మోహనరావు కుమారుడు కంకణాల సత్యవరప్రసాద రావుకు ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు వల్లూరు సూర్యప్రకాశరావు, పార్టీ మండల కన్వీనరు గుజ్జలపూడి విజయకుమార్ నాయుడు, ఉపాధ్యక్షుడు దువ్వూరు శ్రీనివాసులురెడ్డి, ప్రధాన కార్యదర్శి దాసరి నిరంజన్, తెలుగు మహిళ పవిత్రారెడ్డి, వైసీపీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పారిశ్రామిక భూములను పరిశీలన

కోట, ఫిబ్రవరి 24: మండల పరిధిలోని కొత్తపట్నం పంచాయతీలో గల పారిశ్రామిక భూములను జాయింట్ కలెక్టర్ బన్సాల్, ఆర్డీవో కిరణ్‌కుమార్ శనివారం పరిశీలించారు. ఈ ప్రాంతంలో ఏపీఐఐసీకి భూములను రైతులు అప్పగించినప్పటికీ కొంతమందికే పరిహారం రావడంతో పలువురు అధికారులను నిలదీశారు. తక్షణమే తమకు పరిహారం అందించాలని, లేకపోతే ఉద్యమం బాట నడుస్తామని రైతులు అధికారులకు తేల్చిచెప్పడంతో తగిన చర్యలు తీసుకుంటామని జేసీ, ఆర్డీవో హామీ ఇచ్చారు.

లక్ష్మీనరసింహస్వామికి పూజలు

చిల్లకూరు, ఫిబ్రవరి 24: మండలంలోని కలవకొండ గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామికి శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. రాత్రి పల్లకిసేవ నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

వందశాతం లక్ష్యాన్ని పూర్తి చేయాలి

వాకాడు, ఫిబ్రవరి 24: వచ్చే నెల 3, 4, 5 తేదీల్లో జరగనున్న పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేసి, వందశాతం చిన్నపిల్లలకు పోలియో చుక్కలు వేయాలని ఎంపీడీవో గోపీనాథ్ సూచించారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఇంటింటా తిరిగి వ్యాక్సినేషన్ పూర్తి చేయాలన్నారు. ఐసీడీఎస్, విద్యాశాఖ సహకారంతో వైద్య సిబ్బంది పోలియో కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో నసీమ్‌ఆలీ, వైద్యులు దీప్తి తదితరులు పాల్గొన్నారు.

విజయశ్రీ గెలుపునకు సమష్టి కృషి: నెలవల


నెలవల సుబ్రహ్మణ్యంకు మిఠాయిలు తినిపిస్తున్న మహిళలు

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 24: సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా నెలవల విజయశ్రీ గెలుపు కోసం అందరూ సమష్టిగా పనిచేద్దామని మాజీ ఎంపీ బబనెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. నాయుడుపేట పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పార్టీలో యువతకు ప్రాధాన్యం ఇస్తున్న నేపథ్యంలో సూళ్లూరుపేట అభ్యర్థిగా విజయశ్రీని ప్రకటించడం జరిగిందన్నారు. సమష్టి కృషితో విజయశ్రీని గెలిపించి చంద్రబాబునాయుడుకు ఇస్తామని చెప్పారు. రాష్ట్రానికి భవిష్యత్తు ఉండాలంటే చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కాగా, నెలవల విజయశ్రీ ని సూళ్లూరుపేట ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించడంతో టీడీపీ కార్యాలయం వద్ద సంబరాలు జరుపుకున్నారు. తెలుగు మహిళల ఆధ్వర్యంలో మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి: కురుగొండ్ల


కరపత్రాలు పంపిణీ చేస్తున్న కురుగొండ్ల

వెంకటగిరి, ఫిబ్రవరి 24: చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. శనివారం పట్టణంలోని 7వ వార్డులో బాబు ష్యూరిటీ - భవిషత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ అధికారంలోకి వస్తే అమలు చేయనున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. అభివృద్ధిని ఆకాంక్షించి టీడీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో క్లస్టర్, యూనిట్, భూత్ ఇన్‌చార్జిలతోపాటు జనసేన నాయకులు, ఐటీడీపీ, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదు

వాకాడు, ఫిబ్రవరి 24: చిట్టమూరు మండలంలోని బయ్యావారికండ్రిగ చెరువు కలుజు, కట్ట ఎత్తు తగ్గించడంతో ఆయకట్టు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పనబాక కోటేశ్వరరావు ఇరిగేషన్ డీఈ సుబ్బారావుకు ఫిర్యాదు చేశారు. శనివారం వాకాడులోని స్వర్ణముఖి అతిథి గృహంలో ఇరిగేషన్ డీఈని కలిసిన కోటేశ్వరరావు వినతిపత్రం అందజేశారు. 2015లో అప్పటి ఇరిగేషన్ అధికారులు బయ్యావారికండ్రిగ చెరువు ఫిట్‌నెస్ లెవల్‌కు అనుగుణంగా కలుజు కట్ట నిర్మాణం చేపట్టారని తెలిపారు. 2020లో ప్రపంచబ్యాంక్ నిధులు రూ.48లక్షలతో చెరువు మరమ్మతు పనులు చేపట్టారని, ఆ సమయంలో చెరువు కలుజు ఎత్తు రెండు అడుగులు, కట్ట ఎత్తు తగ్గించేశారని, అంతేకాకుండా కేవలం రూ.10 లక్షలు కూడా ఖర్చు చేయకుండా నిధులు దుర్వినియోగం చేశారని ఆరోపించారు. దీనివల్ల చెరువులో ఆయకట్టుకు సరిపడా నీరు నిల్వ ఉండడంలేదన్నారు. చెరువులో 30 ఎకరాలకు పైగా కొంత మంది ఆక్రమించి వరిసాగు చేపట్టారని, వారి భూముల్లో నీరు నిల్వ ఉండకుండా చేసేందుకే కట్ట, కలుజు ఎత్తు తగ్గించారని డీఈకి ఫిర్యాదు చేశారు. నిధులు దుర్వినియోగం చేసిన ఇరిగేషన్ అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన వెంట బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబరు పామాంజి కృష్ణయ్య ఉన్నారు.

వరకట్న వేధింపులపై కేసు

కోట, ఫిబ్రవరి 24: తన భర్త, అత్త వరకట్న వేధింపులకు గురిచేస్తున్నారంటూ కోట పట్టణ పరిధిలోని శ్యామసుందరపురానికి చెందిన మోబినా పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ నాగబాబు శనివారం తెలిపారు. శ్యామసుందరపురానికి చెందిన మోబినాకు గూడూరు రాణిపేటకు చెందిన షాన్వాజ్‌తో ఐదేళ్ల క్రితం వివాహమైంది. కట్నం తీసుకురావాలని భర్త షాన్వాజ్‌తో పాటు అతని తల్లి తరచూ వేధిస్తుండడంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మంచి నాయకుడిని ఎన్నుకోండి


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్ఐ మనోజ్‌కుమార్

గూడూరు, ఫిబ్రవరి 24: ప్రలోభాలకు లొంగకుండా ప్రతిఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకుని మంచి నాయకుడిని ఎన్నుకోవాలని గూడూర రూరల్ ఎస్ఐ మనోజ్‌కుమార్ అన్నారు. శనివారం స్థానిక డీఆర్‌డబ్ల్యూ కళాశాలలో ప్రజాసత్తా ఆధ్వర్యంలో ఓటుహక్కు విలువపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగంలో 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరికీ ఓటుహక్కు కల్పించడం జరిగిందన్నారు. యువత ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజాసత్తా వ్యవస్థాపక అధ్యక్షుడు శోభన్‌బాబు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు వజ్రాయుధం లాంటిదన్నారు. సమర్థత కలిగిన నాయకుడిని ఎన్నుకుంటేనే అభివృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు. కార్యక్రమంలో అరవ పార్వతయ్య, చిరంజీవి, పుష్పాంజలి, దయాకర్, అనిత్‌కుమార్, ప్రిన్సిపాల్ హనుమంతరావు పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటం: ఏఐటీయూసీ

గూడూరు, ఫిబ్రవరి 24: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటాలు సాగించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తోందన్నారు. కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేస్తామన్న హామీలను నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో ప్రభాకర్, శివకుమార్, శశికుమార్, చంద్రయ్య, నారాయణ, రమేష్, మురళి, సుబ్రహ్మణ్యం, యాకోబు, భాస్కర్, శేషయ్య, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌బీకేఆర్‌లో మేక్టోడియా సదస్సు

కోట, ఫిబ్రవరి 24: మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం మేక్టోడియా జాతీయ సాంకేతిక సదస్సు జరిగింది. చెవిరెడ్డి రవికుమార్‌రెడ్డి, వినోద్‌కుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. పలు రాష్ట్రాల నుంచి 400మందిపైగా ఇంజనీరింగ్ విద్యార్థులు పాల్గొన్నారు. ఆయా కళాశాలల డైరెక్టర్లు మాట్లాడుతూ మెకానికల్ విద్యార్థులు డిజైన్, అనాలసిస్, ఎకనామిక్, ట్రిములేషన్ వంటి కార్యక్రమాల్లో నైపుణ్యాలు కలిగి ఉంటే ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు.

ఆశతో కాదు... సంకల్పంతో వచ్చా: మస్తాన్ యాదవ్


మీడియాతో మాట్లాడుతున్న డాక్టర్ మస్తాన్ యాదవ్

వెంకటగిరి, ఫిబ్రవరి 24: తాను ఎమ్మెల్యే టికెట్‌పై ఆశపడి రాలేదని.. వెంకటగిరి నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ముందుకు నడిపించాలన్న సంకల్పంతో వచ్చానని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ మస్తాన్ యాదవ్ తెలిపారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ నియోజకవర్గంలో 66 శాతం వున్న బీసీలు మొదట నుంచి టీడీపీతోనే ఉన్నారని చెప్పారు. గతంలో బీసీ సామాజిక వర్గానికి చెందిన సినీనటి శారదను వెంకటగిరి టీడీపీ అభ్యర్థిగా చంద్రబాబు బరిలో దింపారని గుర్తుచేశారు. ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు తనకు అన్ని అర్హతలు వున్నట్లు చెప్పారు. టీడీపీ అధినేత చంద్రబాబు ఆశీస్సులు కూడా వున్నాయని, వెంకటగిరి టికెట్ బీసీలకే కేటాయిస్తారని తనకు నమ్మకముందని మస్తాన్ యాదవ్ అన్నారు. సమావేశంలో రామచంద్రయ్య, మురళి, శ్రీనివాసులు, చెంచయ్య తదితరులు పాల్గొన్నారు.

చెస్ పోటీల్లో చిన్నారి జశ్విత ప్రతిభ



బహుమతి అందుకుంటున్న జశ్విత

పెళ్లకూరు. ఫిబ్రవరి 24: పెళ్లకూరు మండలం పాలచ్చూరు గ్రామనికి చెందిన ఎద్దల నరేంద్రరెడ్డి, అనూష దంపతుల కుమార్తె జశ్విత బెంగుళూరులో జరిగిన చెస్ టోర్నమెంట్‌లో పాల్గొని వరుసగా రెండు రోజులు ప్రథమ బహుమతి అందుకుంది. శుక్రవారం జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయిలో చెస్ పోటీల్లో ప్రథమ బహుమతి సాధించగా, శనివారం జరిగిన కర్ణాటక రాష్ట్రస్థాయి చెస్‌పోటీల్లో ప్రథమ బహుమతి అందుకుంది.

వైభవంగా శ్రీవారి పాదాల ప్రతిష్ట


స్వామివారి పాదాల ప్రతిష్టలో ఉభయదాతలు

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 24: నాయుడుపేట పట్టణ పరిధిలోని తుమ్మూరులో వెలసిన్న శ్రీదేవి భూదేవి సమేత కరిమాణిక్యస్వామి ఆలయంలో స్వామివారి పాదాల ప్రతిష్ఠ వైభవంగా నిర్వహించారు. శనివారం ఉదయం ఆలయ ప్రాంగణంలో వేదపండితుల మంత్రోర్చణల నడుమ శ్రీవారి పాదాల ప్రతిష్ఠ చేశారు. అనంతరం జరిగిన సత్యనారాయణస్వామి వ్రతంలో దంపతులు పాల్గొన్నారు. ఉభయదాతలుగా చేనిగుంట ప్రభాకర్ దంపతులు, చేనిగుంట జనార్దన్ దంపతులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

టైనీటాట్స్‌లో రోబోటిక్ ప్రదర్శనలు

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 24: సూళ్లూరుపేటలోని టైనీటాట్స్ సీబీఎస్ క్యాంపస్‌లో శనివారం విద్యార్థులచే రోబోటిక్ ఎక్స్ పరమెంట్స్ ప్రదర్శించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రీసిటీ ఇసుజు కంపెనీ జీఎం మురుగన్ రాయ మాట్లాడుతూ విద్యార్థులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతోనే మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఇసుజు డీఎం ఎస్.సుధాకర్, షార్ విశ్రాంత ఉద్యోగి జగదీష్ చంద్రారెడ్డి, టైనీటాట్స్ విద్యాసంస్థల అధినేత వేనాటి ధనుంజయ రెడ్డి పాల్గొన్నారు.